

సరిపడా విత్తనాలు, యూరియా

- రైతులు ఎక్కువ మోతాదులో యూరియా ఉపయోగించొద్దు
- నకిలీ విత్తన విక్రేతలపై పీడీయాక్ట్ నమోదు చేస్తాం
- నేడు 44 వేల మంది రైతులకు రుణమాఫీ
- నిజామాబాద్ జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్


జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా వ్యాప్తంగా రైతులకు సరిపడా యూరియా, విత్తనాలు అందుబాటులో ఉంచినట్టు జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు. రైతులు అవసరమైనంత మేరకే ఎరువులను పంట పొలాల్లో ఉపయోగించాలని, అంతకుమించి ఎక్కువ మోతాదును వ్యవసాయ క్షేత్రంలో యూరియాని ఉపయోగించవద్దని సూచించారు. అంతేకాకుండా యూరియా ముందస్తు కొనుగోలు చేసి ఇంటి వద్ద స్టాక్ పెట్టుకోవద్దని జిల్లా రైతంగానికి అవసరం ఉన్నంతవరకు ఎరువులు అందుబాటులోనే ఉన్నాయని రైతులు దిగులు చెందవద్దు అని చెప్పారు. నవతెలంగాణ ఏరువాక ప్రత్యేక సంచికకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

4.30 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో సాగు విస్తీర్ణం 5 లక్షల 40 వేల వరకు ఉంటుందని అంచనావేశాం. అందులో ఇప్పటివరకు 4,30,000 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. 90 శాతం మంది రైతులు వరిని సాగుచేసేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న 42 వేల ఎకరాలు, సోయాబీన్ 34 వేలు, పసుపు పంట 19 ఎకరాల వరకు సాగు చేస్తున్నారు.

అందుబాటులో ఎరువులు, యూరియా

జిల్లాలో రైతులకు అవసరమైనంత ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఎటువంటి ఇబ్బంది పడవద్దని సూచించారు. యూరియా బస్తాలు అవసరమైనప్పుడు కొరత ఏర్పడుతుందేమోనని ముందస్తుగానే కొనుగోలు చేసి ఇంటి వద్ద పెట్టుకోవద్దని అన్నారు. జిల్లాకు 53 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్టు చెప్పారు. కాంప్లెక్స్ కొరత కూడా లేకుండానే అందుబాటులో ఉంచామని రైతులకు ఎప్పటికప్పుడు సొసైటీల ద్వారా మార్క్ఫెడ్ సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. రైతులు పంట సాగు చేసే చివరి దశ వరకు కూడా యూరియా ఎటువంటి ఇబ్బంది లేకుండా సరైన సమయానికి సక్రమంగా అందరికీ అందుబాటులో ఉంచే విధంగా స్టాక్ ఉందని, రైతులు పంట పొలంలో ఎంత అవసరమో ▸ మిగతా 3లో..

వ్యవసాయం 'చదివేద్దాం'

- 2015లో రుద్రూర్ ప్రొఫెసర్ జయశంకర్ ఆహార విజ్ఞాన విశ్వవిద్యాలయం ఏర్పాటు
- అందుబాటులో నాలుగు కోర్సులు



నవతెలంగాణ-వర్ని

రుద్రూర్ మండలంలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం అనుబంధంగా 2015 సంవత్సరంలో ఆహార శాస్త్ర సాంకేతిక విజ్ఞాన కళాశాలను ఏర్పాటు చేశారు. ఆహార ప్రాసెసింగ్ సంరక్షణకు సంబంధించిన సాంకేతికతలో ఆవిష్కరణలు చేసి వాటిని రైతుల వాడకంలోకి తీసుకువచ్చి ఆహారం, పోషకాల భద్రతను సాధించాలన్న దృక్పథంతో ఈ కళాశాలను స్థాపించారు. ఈ కళాశాలలో వ్యవసాయ, వివిధ ఉద్యాన పంటలలో డిమాం డ్, విలువ ఆధారిత నాణ్యమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందిస్తూ వారిని సమాజంలో ఒక ఉద్యోగంలోనే కాకుండా వ్యవస్థాపకులుగా తీర్చడం కోసమే ఈ కళాశాల లక్ష్యంగా ఏర్పాటు చేశారు.

కోర్సులివీ..

ఈ కళాశాలలో 4 సంవత్సరాల పాటు విద్యార్థులకు కోర్సులుంటాయి. బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ)డిగ్రీ కోర్సును అందిస్తుంది ఈ కళాశాల. మొదటి 3 సంవత్సరాలలో ఫుడ్ కెమిస్ట్రీ, ఫుడ్ మైక్రోబయాలజీ, ఫుడ్ ఇంజినీరింగ్ కోర్సులు అలాగే చివరి సంవత్సరంలో ఎక్స్‌పీరియన్సియల్ లెర్నింగ్, ఇండస్ట్రియల్ అటాచ్‌మెంట్, ప్రాజెక్ట్ వంటి వినూత్నమైన కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు ఆహార ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌లలో క్షేత్రస్థాయి శిక్షణను అందించి వ్యవస్థాపకులుగా మారేందుకు సంసిద్ధ పరుస్తారు. సాంకేతిక పరంగానే కాకుండా విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను కూడా మెరుగుపరుస్తున్నారు.

కోర్సులలోని విభాగాలు..

ఫుడ్ ప్రాసెస్ టెక్నాలజీ..

ఈ విభాగంలో విద్యార్థులు రైతులకు పలు పరిశ్రమలకు, వినియోగదారులకు నాణ్యమైన సురక్షితమైన ఆహార పదార్థాలను తయారు చేసి ఎక్కువ రోజులు నిలువ ఉండే సామర్థ్యం అనుభవాన్ని సాధించేలా ఆహార ఉత్పత్తుల హ్యాండ్లింగ్, ప్రాసెసింగ్ నాణ్యతను నిర్ధారించుటలో నిష్ణాతులవుతారు.

ఫుడ్ ప్రాసెసింగ్ ఇంజనీరింగ్..

ఈ విభాగంలో ఇంజనీరింగ్ సూత్రాలను వర్తింపచేయ డం ద్వారా ఫుడ్ ప్లాంట్, ఎక్విప్మెంట్ డిజైన్, ప్రాసెస్ కంట్రోల్ ప్యాకింగ్, స్టోరేజ్‌కు సంబంధించిన సాంకేతికత ఇంప్లిమెంటేషన్‌లో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు.

గ్రామీణ వ్యవస్థాపక అవగాహనా అభివృద్ధి యోజన..

వ్యవసాయ, అనుబంధ కోర్సుల విద్యార్థులకు ఉపాధి అవకాశాలను చూపించి, వాటిలో వారికి నైపుణ్యాన్ని అందించడం, ద్వారా విశ్లేషణాత్మక పరిజ్ఞానాన్ని పెంచి వ్యవస్థాపకులుగా రూపొందించడం రెడీ ప్రోగ్రాం ముఖ్య ఉద్దేశం. ఇది ఐసీఏఆర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాల యాలకు అందించబడ్డ ఒక గొప్ప కార్యక్రమం.

భవిష్యత్తు అవకాశాలు..

బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ) కోర్సు తరువాత విద్యా ర్థులు ఎం.టెక్, పీహెచ్‌డీ చేయటం ద్వారా ఉన్నత విద్యను అభ్యసించవచ్చు. ఎంబీఏ కోర్సులు విదేశాలలో ఎంఎస్ చేయవచ్చు.

ఉన్నత విద్యను అందిస్తున్నాం



రుద్రూర్ ప్రొఫెసర్ జయ శంకర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం అనుబంధంతో కూడిన టెక్నాలజీ కాలేజీలో ఇంటర్ విద్యార్థులకు అవకాశాలుం టాయి. విశాలమైన తెలంగా ణలో పరిశోధన కేంద్రం ఉంది. ఈ కళాశాలలో ఉన్నత స్థాయిలో ఉద్యోగ అవకాశాలు పొందే విధంగా విద్యార్థులకు మంచి అవకాశాలు కళాశాల ద్వారా నేర్పించబడతాయి. ఉన్నత విద్య చదివిన అధ్యాపకులచే కళాశాల విద్యార్థులకు విద్యను అందిస్తున్నాం. – కళాశాల ప్రిన్సిపాల్ కల్పన

రైతులు పప్పు దినుసులు

పండించాలి

- కామారెడ్డి ఏడిఏ అన్నపూర్ణ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి డివిజన్ పరిధిలో ఎక్కువగా వర్షాధారం ద్వారానే పంటలు పండిస్తారని తద్వారా ఎక్కువగా పప్పు దినుసులు పండించే దానిపై దృష్టి సారించి పప్పు దినుసులు పండిస్తే భూమికి సైతం పంట మార్పిడి జరిగినట్టు ఉంటుందని కామారెడ్డి ఏడిఏ అన్నపూర్ణ అన్నారు. నవతెలంగాణతో బుధవారం ఆమె ప్రత్యేకంగా మాట్లాడారు. 'గతంలో వరితోపాటు మొక్కజొన్న, పెసర, మినుము, కంది తదితర పంటలను రైతులు సాగుచేసేవారు. నేడు అవి తక్కువై అధికంగా వరి సాగు పైనే శ్రద్ధ చూపిస్తున్నారన్నారు. గత ఏడాది వర్షాకాలంలో 83వేల ఎకరాలు సాగు చేయగా, ఈ వర్షాకాలంలో 79 వేల ఎకరాలను రైతులు సాగుచేస్తున్నట్టు అంచనా వేశాం. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల వల్ల 70 వేల నుంచి 73 వేల ఎకరాలలో వివిధ పంటలను సాగు చేసే అవకాశం ఉంది. అత్యధికంగా రైతులు వరిని సాగు చేస్తున్నారు. ప్రస్తుత వానకాలంలో మొక్కజొన్న పత్తి గాతేడా 6000 ఎకరాలలో సాగు చేయగా, ఈ సంవత్సరం 3వేల ఎకరాల్లో సాగుచేయనున్నారు. చెరుకు ఈ సంవత్సరం 144 ఎకరాలలో, మినుము, పెసర, కంది 500 ఎకరాలలో, సోయాబీన్ 200 ఎకరాలలో సాగు చేయనున్నారు. ఈ సంవత్సరం సుమారు 70వేల ఎకరాలలో వరి సాగు అంచనా వేశాం. నారు ముదిరితే 191919 మందును ఒక ఎకరంలో ఒక్క డబ్బాలో ఐదు మిల్లి గ్రాముల మందును కలిపి, రెండు డబ్బాలు ఒక ఎకరాకు సరిపడా వరి నారుపై పిచికారీ చేయాలి. అలా చేయడం వల్ల నత్రజని లోపం పోయి అవి పచ్చగా మారకుండా ఉంటాయి.' అని ఆమె తెలిపారు.

సేంద్రియ ఎరువులు మేలు..

'ప్రస్తుత కాలంలో రైతులు అధిక దిగుబడి సాధించాలన్న ఉద్దేశంతో రసాయన ఎరువులను మోతాదుకు మించి వాడుతున్నారు. అలా వా డడం వల్ల పంట భూములు దెబ్బ తినడమే కాకుండా ఆహారం తిన్న వారు అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉంది. రసాయన ఎరువుల స్థానంలో సేంద్రియ ఎరువులను వాడితే అటు పంటకు మేలు జరగ డమే కాకుండా భూమిదెబ్బ తినకుండా ఉంటుంది. ఈ ఆహారాన్ని తీసుకున్న ప్రజలు సైతం ఆరోగ్యంగా ఉంటారు. కావున రైతులు ఎక్కువగా సేంద్రియ ఎరువులపై దృష్టి పెట్టి వారి తోటి రైతులకు సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పించాలి.' అని సూచించారు.

ఎరువుల కొరత లేకుండా అందిస్తున్నాం

- ప్రతి రైతుకు పారదర్శకంగానే ఎరువుల విక్రయాలు
- త్వరలో ప్రతి మండలంలో రైతు నేస్తం ప్రారంభం
- నియోజకవర్గంలో 89000 ఎకరాల్లో వరి సాగు

నవతెలంగాణ-బోధన్

ప్రస్తుతం వర్షాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు పంటలు సాగు చేయడంలో నిమగ్నమయ్యారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం ఎరువులు, విత్తనాలను సరిపడా స్థాయిలో అందిస్తుంది. రైతులకు చీడపీడల నివారణపై మండల వ్యవసాయ అధికారులు, ఇంచార్జ్ ఏడిఏ సంతోష్ సలహాలు సూచనలు అందిస్తున్నారు. అలాగే బోధన్ నియోజవర్గంలో రైతులకు కావలసిన ఎరువులు విత్తనాలను ఆయన సరఫరా చేయడంలో జాగ్రత్తలు చేపడుతున్నారు. అలాగే ప్రభుత్వం రైతు నేస్తం ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు నూతన సాగు విధానంపై అవగాహన కల్పించడానికి కార్యక్రమం చేపట్టడంతో ఆయన రైతు నేస్తం కార్యక్రమం కోసం రైతు వేదికల్లో ఆన్లైన్ నిర్వహణ కోసం కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నారు. అగ్రికల్చర్ డే స్పెషల్ సందర్భంగా బోధన్ ఇంచార్జ్ ఏడీఏతో నవతెలంగాణ ప్రతినిధి ముఖాముఖి నిర్వహించారు.

నవతెలంగాణ: రైతు వేదికలు రైతుల కోసం ఉపయోగిస్తున్నారా?

ఏడీఏ: పంటల సాగుపై ప్రభుత్వం రైతు వేదికలు నిర్మించిన ప్రతి చోట వాటిని ఉపయోగిస్తున్నాం. ప్రతి రైతు వేదికలో రైతు భరోసా కార్యక్రమం సమావేశాలు ఏర్పాటు చేశాం. అలాగే మరో రెండు రోజుల్లో నిజామాబాద్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి రైతు సదస్సు సమావేశం ఏర్పాటు చేస్తున్నాం.

నవతెలంగాణ: వాణిజ్య పంటలపై రైతులకు ఏ విధంగా అవగాహన కల్పిస్తున్నారు?

ఏడీఏ: ప్రతివారం రైతు వేదికలలో వ్యవసాయ శాస్త్రవేత్తలతో అవగాహన కల్పిస్తున్నాం. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ట్రయల్ రన్ నిర్వహించాం. బీఎస్ఎన్ఎల్ నెట్వర్క్ సమస్య వలన ఆలస్యం జరిగింది. రైతు నేస్తం కార్యక్రమంపై రైతులకు అవగాహన ప్రతి మంగళవారం ఏఈఓల ఆధ్వర్యంలో నిర్వహిస్తాం. వీడియో కాన్ఫరెన్స్ హాల్ ఉన్నచోట ఈ కాన్ఫరెన్స్ చేపడుతున్నాం. బోధన్ మండలంలో బోధన్ రైతు వేదికలో, సాలూర మండలంలోని సాలూరా రైతు వేదికలో, రెంజల్ మండలంలోని రెంజల్ రైతు వేదికలో, జన్నెపల్లిలో, ఎడపల్లి మండలంలో నేరుగా కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. గతంలో డివిజన్‌కు ఒకటే సౌకర్యం ఉండేది. ప్రస్తుతం ప్రతి మండల నికి కాన్ఫరెన్స్ సౌకర్యం కోసం ఏర్పాటు చేశాం. త్వరలో ప్రతి రైతు వేదికలో ఈ సౌకర్యం కల్పిస్తున్నాం. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఆరుతడి పంటలు, వాణిజ్య పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తారు. రైతులు నేరుగా శాస్త్రవేత్తలతో ముఖాముఖి మాట్లాడవచ్చు.



నవతెలంగాణ: వర్షాకాలం సాగు ప్రారంభమైనందున రైతులకు రైతుబంధు డబ్బులు ఎప్పుడు జమ చేస్తున్నారు?

ఏడీఏ : రైతుబంధు డబ్బులు పంపిణీ కోసమే గత వారం క్రితం సొసైటీల వారీగా రైతులతో సమావేశాలు ఏర్పాటు చేశాం. ప్రస్తుతం జిల్లా స్థాయిలో 13వ తేదీ నుంచి కార్యక్రమాలు మొదలయింది. రైతుబంధుపై రైతుల అభిప్రాయాలు తెలుసుకొని ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత ప్రభుత్వం డబ్బులు జమచేసే అవకాశం ఉంటుంది. 18వ తేదీ వరకు ఈ రైతు సమావేశాలు జరుగుతాయి. దాని తర్వాత ప్రభుత్వం నిర్ణయాల ప్రకారం డబ్బులు జమచేస్తారు. రైతుబంధు పరిమితిపై రైతుల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది.

నవతెలంగాణ : సొసైటీలలో ఎరువులు, విత్తనాల కొరత ఉందా?

ఏడీఏ : సొసైటీలలో ఎలాంటి ఎరువుల కొరత లేదు. రైతులకు సరిపడా ఎరువులు అందిస్తున్నాం. ఎరువుల కొరత లేకుండా పారదర్శకంగా ఆన్లైన్లో నిరంతరం అధికారులు పర్యవేక్షిస్తారు. ప్రైవేటు డీలర్ల కంటే సొసైటీలకు ఎక్కువ ఎరువులు ప్రభుత్వం అందిస్తుంది. ఈపీఓస్ మిషన్ ద్వారా రైతులకు ఎరువుల విక్రయాలు చేస్తున్నాం. దీంతో అధికారులు నేరుగా ఎరువుల స్టాక్ వివరాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది. దాని ద్వారా ఏ సొసైటీలో ఎంత ఎరువులు ఉన్నాయో ప్రభుత్వ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటారు. ఏకంగా ఢిల్లీ నుంచి ఈ రిపోర్టు అందుతుంది. రైతులు బయోమెట్రిక్ విధానంలో ఎరువులు తీసుకుంటారు. ఒకవేళ రైతు బయోమెట్రిక్ లేకుండా ఎరువులు తీసుకోలేరు. దాంతో ఎరువుల విక్రయాలు, నిల్వలు పారదర్శకంగా ప్రభుత్వానికి తెలుస్తుంది. వ్యవసాయ అధికారులు సైతం వారి కార్యాలయంలో నుంచి పనిచేయడానికి వీలు లేదు. క్షేత్రస్థాయిలో ఉండి ఫోటో అప్లోడ్ చేస్తేనే యంత్రం పనిచేస్తుంది. ఎరువుల విక్రయాలలో ఎలాంటి అవకతవకలకు అవకాశం ఉండదు.

నవతెలంగాణ : బోధన్ నియోజకవర్గంలో రైతులు ఏ ఏ పంటలు సాగు చేస్తున్నారు?

ఏడీఏ: ప్రధానంగా వరి, సోయా, పత్తి, పప్పు దినుసులైన కందులు, మినుములు, పెసర పంటలు సాగు చేస్తున్నారు. ఎడపల్లి మండలంలో 13000 ఎకరాలలో వరి సాగు చేస్తున్నారు. బోధన్ ఉమ్మడి మండలంలో 35000 ఎకరాలలో వరి సాగు చేస్తున్నారు. 11,000 ఎకరాలలో సోయా సాగు చేస్తున్నారు. నవీపేట మండలంలో 24 వేల ఎకరాలలో వరి సాగు చేస్తున్నారు. రెంజల్ మండలంలో 4500 ఎకరాలలో సోయా, 17000 ఎకరాలలో వరి పంట సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం లక్ష 9వేల ఎకరాలలో రైతులు పప్పు దినుసులు సాగు చేస్తున్నారు. 300 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేస్తున్నారు.

నాణ్యతకు మారుపేరు హిమాలయ సీడ్స్

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రతి సంవత్సరం జిల్లాల్లో పంటల సాగు విస్తీర్ణం పెరుగుతుందని, శాస్త్రవేత్తల, వ్యవసాయ అధికారుల సూచనలు. సలహాలతో రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్నట్టు మండలంలోని అంకాపూర్ హిమాలయ హైబ్రిడ్ సీడ్స్ ప్రోప్రైటర్ మల్లేష్ తెలిపారు. వర్షాలు బాగా పడి పంటలు బాగా పండాలని మనస్ఫూర్తిగా కోరుకుం టూ రైతులకు ఏరువాక శుభాకాంక్షలు తెలి పారు. ముఖ్యంగా హిమాలయ హైబ్రిడ్ సీడ్స్ నుండి 3663 సర్దార్ వరి విత్తనా లతో పాటు సన్న రకాల్లో జీకేఆర్ఎస్, టెంపర్, ఏకే 47 వెరైటీల తో అధిక దిగుబడులు వచ్చినట్టు తెలిపారు. రైతే రాజు అన్న పదాన్ని అక్షర సత్యం అని జిల్లా రైతన్నలు నిరూపిస్తు న్నారని అన్నారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైన సాగునే నమ్ముకుని దేశంలోనే అంకాపూర్ గ్రామం పేరు తెచ్చుకోవడం హర్షనీయమని అన్నారు.



హిమాలయ హైబ్రిడ్ సీడ్స్ ప్రొప్రైటర్ మల్లేష్

కిసాన్ హైబ్రిడ్ సీడ్స్‌తో అధిక లాభాలు

- మేనేజింగ్ డైరెక్టర్ జి.వినోద్ రెడ్డి



కిసాన్ హైబ్రిడ్ మేనేజింగ్ డైరెక్టర్ వినోద్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

నిరంతరం రైతుల కోసం కృషి చేస్తున్నట్టు కిసాన్ హైబ్రిడ్ సీడ్స్ తో రైతులకు అధికంగా పంట దిగుబడులు వచ్చి లాభాలు వస్తాయని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ జి.వినోద్ రెడ్డి తెలిపారు. నవతెలంగాణ దినపత్రిక ఏరువాక ప్రత్యేక సంచిక సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాన్ని ఎంచుకునే ముందే జాగ్రత్త తీసుకోవాలని, విత్తనాల నాణ్యతతోనే పంట సాగుకు మేలు జరుగుతుందని అన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన నేను నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతన్నల కష్టాలు చూసి నా వంతుగా నాణ్యమైన అధిక దిగుబడులు వచ్చేలా విత్తనాలను అందిస్తున్నామని తెలిపారు. 2010 లో కిసాన్ హైబ్రిడ్ సీడ్స్ ను ప్రారంభించి నాటి నుంచి ఖరీఫ్, రబీ సీజన్లోనూ రైతులకు అధిక దిగుబడి వచ్చేలా వరి, మొక్కజొన్న, నువ్వులు, గడ్డి జొన్నలు తదితర విత్తనాలను అందజేస్తున్నట్టు తెలిపారు..

సరికొత్త విత్తనాలను తీసుకు వస్తూ...

రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మారుతున్న వాతావరణానికి అనుగుణంగా సరికొత్త విత్తనాలను తీసుకురావడం జరుగు తుందని, డబుల్ గోల్డ్ 9 9, వరి పంటలో కిసాన్ విజేత, కిసాన్ రాజా తీసుకొచ్చినట్టు తెలిపారు. వాతావరణ పరిస్థితులను తట్టుకుంటూ ఖరీఫ్, రబీ సీజన్లలో మంచి దిగుబడులు వస్తాయని చెప్పారు.

రీజనల్ సేల్స్ మేనేజర్ మార్చెట్టి సతీష్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మార్కెటింగ్ సిబ్బంది ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉంటూ తగు సూచనలు, సలహాలు ఇస్తున్నామని తెలిపారు.

సరిపడా విత్తనాలు, యూరియా

-మొదటిపేజీ తరువాయి

అంతవరకే యూరియా ని పంట పొలాల్లో ఉపయోగించుకోవాలని అన్నారు. అంతే కాకుండా మార్క్ ఫేడ్ దగ్గర ఇంకా 14,000 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంచామని వివరించారు. ఎప్పుడు యూరియా కావాలన్నా వ్యవసాయ అధికారుల సలహాలు తిసుకొని కొనుగోలు చేసుకోవాలని, వ్యవసాయ అధికారులకు తెలపిన వెంటనే అందుబాటులో ఉంటుందని వివరించారు.

నకిలీ విక్రయాలపై కొరఢా

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు చర్యలు చేపట్టాం. పోలీసు, వ్యవసాయ శాఖ విభాగాలతో సంయుక్తంగా దాడులు చేపట్టాం. నకిలీ, కల్తీ విత్తనాలు విక్రయించిన వ్యాపారస్తులపై చర్యలు తీసుకుంటాం. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్టు తేలితే చర్యలు తీసుకుంటాం.

లక్ష లోపు రుణం ఉన్న రైతులు 44 వేల మంది

రాష్ట్ర ప్రభుత్వం రైతుల రుణమాఫీ చేయుటకు సర్వం సిద్ధం చేసింది. నేడు ఒక్క లక్ష రూపాయల వరకు ఉన్న రైతుల రుణమాఫీ చేయనుంది. తర్వాత 15 రోజుల కాల వ్యవదిలో ఒక్క లక్ష యాభై వేలు వరకు తీసుకున్న రైతుల రుణమాఫీని చెల్లించనుంది. తర్వాత రెండు లక్షల వరకు ఉన్న రైతు పంట రుణమాఫీ చెల్లింపుచేయనుంది. నేడు జిల్లాలో రైతు వేదికల వద్ద సాయంత్రం 4 గంటలకి రైతులతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ రైతు రుణమాఫీ చెల్లింపుల కార్యక్రమాన్ని చేపట్టను న్నారు. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి చేశాం. నిజామాబాద్ జిల్లాలో 44 వేల మంది రైతులు ఒక్క లక్ష రూపాయల రుణమాఫీ పొందనున్నారు.

పుష్కలంగా నీరుంటేనే వరి వేయండి

- లేకుంటే ఆరుతడిపై దృష్టిసారించండి
- వర్షాభావంతో తగ్గినసాగు విస్తీర్ణం
- జిల్లా వ్యాప్తంగా 5 లక్షలకు గాను ఇప్పటి వరకు 2.02 లక్షల ఎకరాల్లో సాగు
- భారీ వర్షాలు కురిస్తే పెరిగే అవకాశం
- జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి

నవతెలంగాణ-కామారెడ్డి

'ఈసారి అనుకున్నంత మేర వర్షాలు కురవలేదు. దీంతో నారు మడులు వేసుకున్న రైతులు నాట్లు వేయలేకపోతున్నారు. దీంతో సాగు విస్తీర్ణం తగ్గింది. పుష్కలంగా నీటి సౌకర్యం ఉంటేనే వరిపంట సాగు చేసుకోవాలని' జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి రైతులకు సూచించారు. వర్షాభావ పరిస్థితులతో ఈసారి సాగు అనుకున్నంత మేర కాలేదని తెలిపారు. రానున్న రోజులు భారీ వర్షాలు కురిస్తే.. సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉన్నట్టు తెలిపారు. నవతెలంగాణ వ్యవసాయరంగ ప్రత్యేక అనుబంధానికి జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ విశేషాలు ఆమే మాటల్లోనే..

ఇప్పటి వరకు 2.02 లక్షల ఎకరాల్లో సాగు

ఈ సంవత్సరం వానకాలం సీజన్‌లో కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 5.14 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని అంచనా వేశాం. అందులో ఎక్కువగా 3,13,965 ఎకరాలు వరి సాగుకానుంది. మక్కా 57,315, జొన్న 57 వేలు, సోయాబీన్ 85444, పత్తి 28,730 తో పాటు పల్లి, మినుము, కందులు, చెరుకు ఇతర పంటలు సాగవుతాయని అంచనా వేశాం. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల్లో సాగువిస్తీర్ణం అనుకున్నంత మేర కాలేదు. రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే.. పెద్దఎత్తున సాగు అయ్యే అవకాశం ఉంది. ఇప్పటి వరకు అందిన రిపోర్ట్ ప్రకారం.. జిల్లా వ్యాప్తంగా 2 లక్షల రెండు వేల 274 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు అయ్యాయి.


జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి

పెరిగిన ఆరుతడి సాగు

ఆరుతడి పంటలు సాగు చేసే ప్రాంతాల్లో ఇప్పటి వరకు అనుకున్నంత మేర పంటలు సాగు అయ్యాయి. అత్యధికంగా సాగు విస్తీర్ణంలో జుక్కల్‌లో మండలంలో 38,593 ఎకరాలు సాగు చేయగా, మద్నూర్ మండలంలో 34,532 ఎకరాలు, గాంధారి మండలంలో 24 వేల, 242 ఎకరాలు, బిచ్కుందలో 23,658 ఎకరాలతో పాటు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల కొన్ని మండలాల్లో తక్కువగా విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు

సాగు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. ఆ వివరాల ఆధారంగానే ఎక్కడెక్కడ ఏ రకం పంటలు సాగవుతున్నాయో తెలుసుకుంటూ అక్కడి రైతులకు సలహాలు, సూచనలు అందజేస్తున్నాం. సాగుచేసిన పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో బిబిపేట మండలం మొదటి స్థానంలో ఉంది. బిబిపేట్ మండలంలో 1524 ఎకరాలు సాగు చేయగా, ఆన్‌లైన్‌లో 1499 ఎకరాలు నమోదు పూర్తయింది.

యూరియా, ఎరువులు సిద్ధం

వానకాలం సీజన్‌లో సాగవుతున్న పంటలకు అనుగ ుణంగా యూరియా, ఎరువులకు ఇండెంట్ పెట్టి తెప్పించాం. 5 లక్షల ఎకరాలకు అనుగుణంగా కావలసిన యూరి యా, డిఏపి, మోప్, ఎన్ పి కే కాంప్లెక్స్ ఎరువులను అంచనా వేసి ప్రతిపాదనలు పంపాం. యూరియా 37,675, మెట్రిక్ టన్నులు, డిఏపి 10,988 మెట్రిక్ టన్నులు, ఎంఓపి 6,229 మెట్రిక్ టన్నులు, ఎన్పీకే కాంప్లెక్స్ 235 97 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం పడుతాయని అంచనా వేశాం.

వరి సాగుపట్ల తొందరపడొద్దు

ఈసారి వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో తొందరపడి అధిక నీరు అవసరమైన పంటలు వేయడం మంచిది కాదు. వర్షాల పరిస్థితులను అంచనా వేసుకుని నాట్లు వేయాలి. ఎక్కువగా నాటు వేయడం వల్ల పంట చివర్లో నీరు అందక రైతులు పెట్టుబడి నష్టపోవాల్సి వస్తుంది. కావున నీటి లభ్యత ఆధారంగా వరి పంటలను సాగు చేసుకోవాలి.

నకిలీ విత్తనాలపై కఠినంగా వ్యవహరిస్తాం

రైతులు నకిలీ విత్తనాల వల్ల నష్టపోకూడదనే ఉద్దేశ్యంతో జిల్లావ్యాప్తంగా అన్ని విత్తన దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్నాం. ఆ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. నకిలీ విత్తనాలను విక్రయించినట్టు మా దృష్టికి తీసుకొస్తే చర్యలు చేపడతాం. నకిలీ విత్తన విక్రేతలపై కఠినంగా వ్యవహరిస్తాం. అవసరమైతే పీడీయాక్ట్ నమోదుకూ వెనకాడబోం. రైతులు విత్తనాలు, పురుగుల మందులు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. లైసెన్స్ ఉన్న దుకాణాల్లో కొనుగోలు చేయాలి. తప్పకుండా రసీదు తీసుకోవాలి.

నవతెలంగాణ వ్యవసాయరంగ ప్రత్యేక అనుబంధం

రుణమాఫీ.. రైతులు హ్యాపీ

- నేడు రైతుల ఖాతాల్లోకి డబ్బులు
- ఆనందంలో అన్నదాతలు

తెలంగాణ సర్కారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడి రైతులకు రుణమాఫీ చేయడం కోసం చర్యలు చేపట్టడంతో అంతట రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన వైయస్ రాజశేఖర్ రెడ్డి తర్వాత రైతులకు రుణమాఫీ చేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రమేనని రైతులు అంటున్నారు. ఈ ప్రభుత్వం రుణమాఫీ కోసం విధివిధానాలు ఖరారు చేయడంతో తమ ఖాతాలో డబ్బులు ఎప్పుడు జమ అవుతాయోనని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

నవతెలంగాణ-బోధన్

నేటినుండి రైతుల ఖాతాల్లోకి..

రుణమాఫీలో భాగంగా ప్రభుత్వం గురువారం నుండి మొదటి విడతలో లక్ష రూపాయల వరకు రుణ మాఫీ డబ్బులను రైతులకు ఖాతాలలో జమ చేయడానికి ఇప్పటికే బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. 18న సాయంత్రం వరకు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి బ్యాంకర్లకు ఆదేశించారు. అందులో భాగంగా రైతు వేదికల వద్ద రుణమాఫీ లబ్ధిదారులతో భారీ ఎత్తున సంబరాలు నిర్వహించడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు సిద్ధమయ్యారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. రుణమాఫీ నిధులు పక్కదారి పట్టకుండా బ్యాంకర్లు జాగ్రత్త వహించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రుణమాఫీతో పాటు ప్రస్తుతం వ్యవసాయం పనులు జోరందుకోవడంతో రైతులు పెట్టుబడి కోసం ఇబ్బందులు పడుతున్నారని, దాంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని కావున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుబంధు డబ్బులు కూడా త్వరగా అందించాలని రైతులు కోరుతున్నారు. రైతు రుణమాఫీతో సన్న, చిన్న కారు రైతులు రుణాల నుంచి విముక్తి కానున్నారు. గత ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా ఎకరం, అరెకరం భూములు ఉన్నా రైతులు బ్యాంకులు, సొసైటీల ద్వారా రుణాలు పొంది వ్యవసాయం చేసుకున్నారు. దాంతో వారు ఏకకాలంలో రుణ విముక్తులు అవుతుండడంతో అంతటా హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మాటిచ్చాం నెరవేరుస్తున్నాం..

ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలో భాగంగా రైతు రుణమాఫీ తొలివిడతగా లక్ష రూపాయల వరకు గురువారం నుండి అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటన తెలిపారు. ఏక కాలంలో రుణమాఫీ చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వం అని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం 2 లక్షల రూపాయల రైతుల రుణమాఫీకి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రైతు కుటుంబాలన్నీ రుణ విముక్తి పొందాలని కోరారు. ఏకాదశి పండుగను ప్రతి ఇంటా రైతులు ఆనందంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.

చిన్న రైతులను ఆదుకున్న దేవుడు రేవంత్ రెడ్డి

మొందూరి రేణుక, దళిత రైతు, సాలూర.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులు తీసుకున్న లోన్లు లక్ష వరకు మాఫీ చేయడంతో మాలాంటి నిరుపేద దళిత రైతులకు ఎంతో మేలు జరిగింది. నాకున్న ఎకరం 10 గంటల భూమిపై 65 వేల రూపాయల లోన్ తీసుకుని పంట సాగుచేసిన. ఆ లోన్ ఇప్పుడు మాఫీ కావడం నాకు సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి నిర్ణయం మాలాంటి సన్నకారు, చిన్నకారు రైతులకు ఎంతో మేలు చేసిందని సాలుర గ్రామానికి చెందిన మొందూరి రేణుక అనే దళిత రైతు తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

లోన్ మాఫీ కోసం ఎదురు చూస్తున్నం

సరిడే మరుబాయి, రైతు-సాలురా



మాకు ఉన్న ఎకరం భూమికి మేము 50 వేల రూపాయల లోన్ తీసుకున్నాం. అది ఎప్పుడు మాఫీ అయితదో అని చాలా రోజుల నుండి ఎదురు చూస్తున్నాం. రేపు ముఖ్యమంత్రి సారు మా లోను మాఫీ చేస్తున్నారు అని తెలిసింది. చాలా సంతోషంగా ఉంది. గిట్లాంటి గవరమెంట్ మాకు ఉంటే మా గరిబోల్ల బాధలు తీరుతాయి. మా లోను మాఫీ చేసినందుకు సీఎం సార్ కు ధన్యవాదాలు.

రుణమాఫీతోపాటు రైతుబంధు మంజూరు చేయాలి

కేజీ గంగారం.రైతు సాలురా

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు రుణమాఫీని చేయడం చాలా గొప్ప విషయమని, దాంతోపాటు ప్రస్తుతం రైతుబంధు డబ్బులు కూడా అందిస్తే రైతులు సీఎం మేలు మర్చిపోరని సాలూరు గ్రామ రైతు కేజీ గంగారం తన అభిప్రాయం వ్యక్తం చేశారు. గతంలో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి రుణమాఫీ చేశారని, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి చేయడం అది కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమని నిరూపించారని అన్నారు. 18వ తేది నాడు లక్ష రూపాయల లోపు రుణమాఫీ కావడంతో రైతులు చాలా సంతోషంగా ఉన్నారని అన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం సాహసోపేతమైంది

మందర్న రవి, హూన్సా సొసైటీ చైర్మన్

గత తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి పోయిందని, ప్రస్తుతం రాష్ట్ర ఖజానాలో ఎలాంటి నిధులు లేకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. దాంతో ఎన్నికలలో ఇచ్చిన మాటతో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడం గర్విస్తున్నానని హూన్సా సొసైటీ చైర్మన్ మందర్న రవి అన్నారు. రుణమాఫీ పొందిన రైతులు 18న సంబరాలు జరుపుకుంటున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంలో జరిగే ఈ ఉత్సవాలకు బోధన్ డివిజన్ నుండి తనకు మాత్రమే ఆహ్వానం అందినందుకు సంతోషంగా ఉంది.

ముఖ్యమంత్రి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం..

ఇల్తెపు బొర్ర గంగారాం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పట్ల తీసుకున్న రుణమాఫీ నిర్ణయాన్ని రైతులందరం స్వాగతిస్తున్నాం. వ్యవసాయం చేసుకోవడానికి ఎందరో రైతులు వడ్డీ వ్యాపారులపై ఆధారపడతారని, అలాంటి ఇబ్బందులు రాకుండా బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి అట్టి రుణాలను నేడు రుణమాఫీ చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం ఎంతో గొప్పది. సీఎంకు కృతజ్ఞతలు.

ఇచ్చిన మాటకు కట్టుబడిన ముఖ్యమంత్రి

అల్లె జనార్దన్-సొసైటీ చైర్మన్ సాలూర

ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులకు రుణమాఫీ చేస్తున్నారని ఆయన మాట తప్పని ముఖ్యమంత్రిగా పేరు సాధించారని సాలురా సొసైటీ చైర్మన్ అల్లే జనార్ధన్ కొనియాడారు గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని రుణమాఫీ సీఎం రేవంత్ రెడ్డి చేయడం గర్విస్తున్నామన్నారు.

చేపల పెంపకం.. లాభదాయకం



వ్యవసాయ క్షేత్రంలో చేపలు పెంచుతున్న చెరువు

- పొలాల్లో చేపల చెరువుల నిర్మాణం
- 10నెలల్లో రూ.15లక్షల ఆదాయం

నవతెలంగాణ-మాక్లూర్

రైతులు వివిధ రకాల పంటల సాగుతోపాటు వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి సారిస్తున్నారు. ఇన్నాళ్లూ ఊర చెరువులు, కుంటలకే పరిమితమైన చేపల పెంపకం ప్రస్తుతం పొలాల వైపు మల్లుతున్నది. గతంలో సరైన నీటి వసతి లేకపోవడంతో ఆసక్తి చూపని రైతులు, ప్రస్తుతం సమృద్ధిగా నీరు అందుబాటులో ఉండడంతో రైతులు చేపల పెంపకానికి ముందుకు వస్తున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన కొంతమంది ఔత్సా హిక రైతులు చేపల సాగులో లాభాలు గడిస్తూ తోటి వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు. సీజన్తో సంబంధం లేకుండా ఏడాదంతా వీటికి బాగా గిరాకీ ఉండడంతో పొలాల్లో చేపల చెరు వులను నిర్మించుకొని ఆర్థికంగా లాభం పొందుతున్నారు.

మండలంలోని రైతులు చేపల పెంపకంపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఖర్చుతో కూడినదైనప్పటికీ ఎక్కువ లాభాలు ఆర్జించే అవకాశాలు ఉండడంతో రైతులు చేపల చెరువులపై మొగ్గు చూపుతున్నారు. సన్న, చిన్న కారు రైతులకు ఇది ఎంతో లాభాదాయకంగా ఉంటుందని చెబుతున్నారు. మండలంలోని మాదాపూర్లో బొంతల శేఖర్ రావు, ముల్లంగి(బీ)లో బూరోల్ల ఆశన్న, బొంకన్పల్లిలో బెండ గంగాధర్ (బాషా) అనే రైతులు వ్యవసాయ క్షేత్రాల్లో చేపల చెరువలను ఏర్పాటు చేశారు. అర ఎకరం పొలంలో వానకాలం, యాసంగి సీజన్లో వరి పండిస్తే ఖర్చులు పోనూ రూ.20వేలు మిగులుతా యని. అదే అర ఎకరంలో చేపల చెరువు ఏర్పాటు చేసుకొని 8 నుంచి10 నెలలు కష్ట పడితే రూ.15 లక్షల వరకు ఆదాయం వస్తుందంటున్నారు. రూ.8లక్షలు ఖర్చులు పోనూ రూ.7లక్షలు మిగులుబాటు అవుతాయని తెలిపారు. 15 ఇంచుల పిల్లలను చెరువులో పెంచాలని, 10 నెలల తర్వాత కిలో సైజ్లో చేపలు చేతికందుతాయని, మార్కెట్లో డిమాండ్ మేరకు హెూల్సేల్ లేదా రిటైల్ చేపలను విక్రయించుకునే అవకాశం ఉంటుంది. మార్కెట్లో నల్ల చేపలకు భలే డిమాండ్ ఉంటుంది. వారానికోసారి చెరువు లోని నీటిని తీసివేసి మళ్లీ కొత్త నీటిని నింపాల్సి ఉంటుందని, మిగతా రోజులు బోరు నీటిని పంటలకు ఉపయోగించుకునే వీలు ఉంటుందన్నారు. అంతర పంటలా ఏడాది పాటు రెండు పంటలతో కలిపి చేపల పెంపకం కూడా చేసుకోవచ్చని, సమయం కూడా కలిసివస్తుందని చెబుతున్నారు. కొర్ర మీను, నల్లమొట్ట చేపలను ప్రజలు తినేందుకు బాగా ఇష్టపడతారని, వాటికి డిమాండ్ బాగా ఉంటుందన్నారు. బహిరంగ మార్కెట్లో కిలో రూ.500-600 ఉంటుందని, ఇక్కడ కిలో రూ.350 నుంచి రూ.400 వస్తే మంచి లాభాలు ఉంటాయన్నారు.

చేపల పెంపకానికి సూచనలు..

అర ఎకరం చెరువులో 6-8వేల వరకు పిల్లలను పెంచవచ్చు. చేప పిల్ల సైజు 15 ఇంచులుండాలి. సిరిసిల్లలో నాణ్యమైన చేపపిల్లలు, పిట్లంలో చేపల దాణా లభ్యమవుతాయి. మొదటి మూడు నెలలు ఉదయం 3కిలోలు, సాయంత్రం 3కిలోలు దాణా వేయాలి. ప్రతి నెలా సైజ్నుబట్టి దాణా వేయాలి. వైరస్ రాకుండా పౌడర్ కలపాలి.5 టన్నుల చేపలకు రూ.15లక్షల వస్తాయి. రూ. 8లక్షలు పెట్టుబడి ఖర్చులు తీసివేస్తే మిగతా రూ. 7లక్షలు ఆదాయం.

ఆదాయం బాగుంటుంది.



భూర్రోల్ల ఆశన్న, రైతు, ముల్లంగి(బి) గ్రామం.

చేపల పెంపకంతో ఆదాయం బాగుంటుంది. ఖర్చుకూడా ఎక్కు వే. కష్టపడితే మంచి ఫలితం ఉంటుంది. అర ఎకరంలో రెండు పంటలు వేసినా లక్ష కూడా మిగలవు. ఇక్కడ 8నెలలు కష్టపడితే లక్షల్లో ఆదాయం ఉంటుంది. పెట్టు బడికి భయపడొద్దు. 24గంటల విద్యుత్ సరఫరా ఉండడంతో చేపల పెంపకానికి బాగా కలిసి వస్తుంది. చేప పిల్లలు వేసిన నుంచి చాలా జాగ్రత్తగా ఉంటే, పది నెలల తర్వాత అద్భుతమైన ఫలితాలు చూస్తాం.

కొత్త వంగడాలకు జీవం

ప్రొఫెసర్ జయశంకర్ చెరుకు, వరి పరిశోధన కేంద్రం కృషి

- **8 మంది శాస్త్రవేత్తలు.. ఎన్నో పరిశోధనలు**

నవతెలంగాణ-వర్ని

కొంగొత్త వంగడాలకు జీవం పోస్తున్నారు ప్రొఫెసర్ జయశంకర్ చెరుకు, వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు. తక్కువ పెట్టుబడులతో పంటలు పండించే విధానంపై.. పంటలకు రోగాలు సోకకుండా ఎరువులను వాడే పద్ధతులపైన రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ.. రైతులకు అనేక సేవలందిస్తోంది ఈ పరిశోధన కేంద్రం.

వర్ని మండలం నుంచి వీడి నూతనంగా ఏర్పడిన రుద్రూర్ మండలం అక్బర్‌నగర్ గ్రామంలో ఉంది ఈ ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధన కేంద్రం. వ్యవసాయంలో రైతులకు రోజురోజుకు మెలుకువలు నేర్పుతున్నది. ఇక్కడ మొత్తం 8 మంది శాస్త్రవేత్తలు పనిచేస్తూ ఉంటారు. వీరు నూతన వంగడాలకు జీవం పోస్తూ చుట్టుపక్కల గ్రామాల రైతుల పంటచేనులకు వెళ్లి శాస్త్రవేత్తలు పంటలను పరిశీలించి పంటలకు వాడవలసిన ఎరువుల మోతాదు గురించి తెలుపుతుంటారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన వంగడాలకు శాస్త్రవేత్తలు జీవం పోస్తున్నారు.

జిల్లాలో చరిత్ర కలిగిన పరిశోధన కేంద్రం..

నిజామాబాద్ జిల్లాలో ఈ చెరుకు వరి పరిశోధన కేంద్రానికి మంచి చరిత్ర ఉంది. నిజాం ప్రభుత్వ హయాంలో ఈ చెరుకు, వరి పండించే విధానంలో రైతులు అభివృద్ధి చెందాలని ఈ పరిశోధన కేంద్రాన్ని నిర్మాణం చేపట్టారు. సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో పలు రకాల పంటలను వీరే స్వయంగా సాగు చేస్తారు. సాగుచేసిన పంటలకు సోకే తెగుళ్లపై శాస్త్రవేత్తలు పరిశోధన చేస్తారు. చుట్టూ ఉన్న గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి అక్కడ రైతుల పంటలను పరిశీలించి తెగుళ్ల రాకుండా వాడే ఎరువుల మోతాదును కూడా శాస్త్రవేత్తలు వివరిస్తారు. ఇక్కడ ఎక్కువగా రైతులు ఉండటంతో ఈ పరిశోధన కేంద్రాన్ని నిజాం ప్రభుత్వం స్థాపించినట్లు తెలుస్తోంది. అదే విధంగా రైతులకు సాగునీరు కోసం పై భాగంలో నిజాంసాగర్ ప్రాజెక్ట్‌ను నిర్మాణం చేసి పంటలకు నీరును అందించారని, చెరుకును పండించే విధానంతో పాటు చెరుకును రైతులు అమ్ముకొని లాభం పొందటానికి బోధన్ ఏరియాలో నిజాంషుగర్ ఫ్యాక్టరీని కూడా నిర్మాణం చేసినట్లు చరిత్ర చెబుతోంది. అందుకు తగ్గ శాస్త్రవేత్తలకు ఉద్యోగం కూడా నిజాంప్రభుత్వం కలిపించింది.



మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారంతో మరింత అభివృద్ధి..

బాన్సువాడ నియోజకవర్గంలో ఉన్న చెరుకు, వరి పరిశోధన కేంద్రానికి రాను రాను శాస్త్రవేత్తలు, పరిశోధనలు తగ్గుముఖం పడుతుండగా గత ప్రభుత్వాల హయాంలో ఎమ్మెల్యేగా, వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. పదో తరగతి విద్యార్థులు పంటల సాగుచేయు విద్య కళాశాలను ఏర్పాటు చేశారు. తెలంగాణ ప్రభుత్వంలో మరో దఫా పోచారం శ్రీనివాస్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి పదవిలో ప్రొఫెసర్ జయశంకర్ పేరుతో 20 కోట్ల రూపాయలతో నూతన భవనాన్ని నిర్మించి మరికొందరిని శాస్త్రవేత్తలను నియమించి అభివృద్ధి చేశారు. కృషి విజ్ఞాన కేంద్రాన్ని వ్యవసాయ పాలిటెక్నికల్‌గా మార్చి విద్యార్థులను కాస్త శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే విధంగా పరిశోధన కేంద్రాన్ని కొత్త పుంతలు తొక్కిం చారు. ఇక్కడికి పలు ప్రాంతాల నుంచి రైతులు వస్తూ పంట సాగు, వ్యవసాయం పరికరాలను వాడే విధానాన్ని తెలుసు కొంటారు. వారి ప్రాంతాలలో ఆ పరికరాలను వాడుతారు.

విడుదల కానున్న నూతన వరి, చెరుకు వంగడాలు..

ఈ ఏడాది నూతన వంగడాలకు శాస్త్రవేత్తలు జీవం పోస్తున్నారు. వాటిని త్వరలో రుద్రూర్ వరి, చెరుకు వంగడాల విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. వరిలో 1, ఆర్.డి.ఆర్ 1200 : ఇది మధ్య కాలిక సన్నగింజ రకం. ఈ రకం 130-135 రోజుల కాల పరిమితి కలిగి ఉంటుంది. ఇది తక్కువ నూక శాతంతో మంచి అన్నం నాణ్యతను కలిగి ఉంది. ఈ రకం ఒక హేక్టరుకు 7600-8500 కిలోల దిగుబడిని ఇస్తుంది. ఈ రకం కొంత వరకు సుడిదోమ, కంకినల్లి, అగ్గి తెగులును తట్టుకుంటుంది. ఇది వానాకాలం సాగుకు అనుకూలమైనది. 2.ఆర్.డి.ఆర్ 1162. ఈ రకం రెండు కాలల్లో సాగుకు అనుకూలమైన సన్న రకం గింజ. వానకాలం 115-125 రోజుల పంట కాలం, యాసంగిలో 125-130 రోజుల పంట కాలంలో చేతి కోస్తుంది. ఇది అతి తక్కువ నూక శాతంతో మంచి అన్నం నాణ్యత కలిగి ఉంటుంది. ఒక హేక్టర్‌కు 7500-8000 కిలోల దిగుబడిని ఇస్తుంది. ఇది కొంత వరకు ఉల్లికోడను, కంకి నల్లిని తట్టుకుంటుందని వరి పరిశోధన శాస్త్రవేత్త సౌందర్య తెలిపారు.

2013 ఆర్ 81 : ఈ రకం ప్రాంతీయ చెరుకు రుద్రూర్ పరిశోధన కేంద్రం నుంచి నూతనంగా విడుదల చేయబడుతుంది. తెలంగాణలో అన్ని ప్రాంతాలలో సాగు చేసుకునే చెరుకు దీని కాల పరిమితి 12 నెలలు. దిగుబడి 1.11 టన్నులు హేక్టర్‌కు వస్తుంది. పంచదార శాతం 20.1. పంచదార దిగుబడి 16.4 టన్నులు హేక్టర్‌కు వస్తుంది.

లక్షణాలు : ఎర్రకులు తెగులు, కాటుక తెగులు, పసుపు ఆకు తెగులును తట్టుకుంటుంది. పీక పురుగును కొంత మేరకు తట్టుకోగలుగుతుంది. నూతనంగా వరి పంటలో రెండు రకాల వంగడాలు, చెరుకులో ఒక రకం వంగడంను రుద్రూర్ చెరుకు, వరి పరిశోధన కేంద్రం నుంచి విడుదల కాబోతుంది. ఈ రకము పంటను వేసుకుంటే రైతులు మంచి దిగుబడిని ఆహారాన్ని పొందుతారని శాస్త్రవేత్తలు తెలిపారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి



తెలంగాణ రాష్ట్ర ప్రాంతాల్లోని రైతులు భూసార పరీక్షలు చేయించుకుని వరి పరిశోధన శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి. ఆరోగ్యకరమైన ఆహారాన్ని కూడా రైతులు పొందుతారు. ప్రస్తుతం రుద్రూర్ ప్రొఫెసర్ జయశంకర్ చెరుకు, వరి పరిశోధన కేంద్రం నుంచి శాస్త్రవేత్తలు నూతనంగా వరి పంట నుంచి రెండు చెరుకు పంట నుంచి ఒకటి నూతన వంగడాలను విడుదల చేశారు.

- డా.బి.బాలాజీ నాయక్. ప్రధాన శాస్త్రవేత్త, రుద్రూర్.

రైతులకు అండగా నిజాంసాగర్

- **విద్యుత్ ఉత్పత్తి, సాగునీరుకు ఎంతో ఉపయోగం**
- **లక్షా 30వేల ఎకరాల ఆయకట్టుకు నీరు**
- **1931లో నుంచి అందుబాటులోకి ప్రాజెక్టు**

నవతెలంగాణ-నిజాంసాగర్

అన్నదాతలకు అండగా ఉండి లక్షల ఎకరాలకు నీరు అందిస్తోంది నిజాంసాగర్ ప్రాజెక్ట్. నిజాంసాగర్ ప్రాజెక్టును 1923లో నిర్మాణం చేపట్టారు. 1931లో నిర్మాణం పూర్తియి.. అప్పటినుండే అందుబాటులోకి వచ్చింది. అప్పటి నిజాం ప్రభుత్వం దీనిని నిర్మించింది. ఈ ప్రాజెక్టు నిర్మించే సమయంలో దేశంలోనే అత్యధికంగా సాగునీరు అందించే ప్రాజెక్టుగా నిలిచింది. ప్రాజెక్టు నిర్మించే సమయంలో 40 ముంపు గ్రామాలను ఆనాటి ప్రభుత్వం ఖాళీ చేయించింది. నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి నవాబ్ ఆలీ నవాజ్ జంగ్ బహదూర్ ప్రాజెక్టుకు ప్రధాన ఇంజనీర్. ఈ ప్రాజెక్టుని మంజీరా నదిపైన నిర్మించారు. ఈ ప్రాజెక్టుకు వరద నీరు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వస్తుంది. ఈ ప్రాజెక్టుని పూర్తిగా గ్రానైట్ రాయి, సూరి, మెర్బార్, డంకు సున్నంతో నిర్మించారు. ప్రాజెక్ట్ పూర్తియి అందుబాటులోకి వచ్చాక ప్రాజెక్టు సామర్థ్యం 29 టీఎంసీల వరకు ఉండేది. 1975 వరకు ప్రాజెక్టు పూడికతో నిండి ప్రాజెక్ట్ సామర్థ్యం 11 టీఎంసీల వరకు పడిపోయింది. 1975లో ప్రాజెక్ట్ రీ మోడలింగ్ చేసి ప్రాజెక్ట్ 1400 అడుగుల నుంచి 1405 అడుగుల వరకు ఎత్తుని పెంచారు. ప్రస్తుతం ప్రాజెక్టు సామర్థ్యం 17.80 టీఎంసీల వరకు ఉంది. దీనిపైన ఉన్న సింగూరు ప్రాజెక్ట్ నిర్మించక ముందు నిజాంసాగర్ ప్రాజెక్ట్‌కు రెండు లక్షల 75 వేల ఎకరాల వరకు సాగునీరును ఈ ప్రాజెక్టు అందించేది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు లక్ష 30 వేల ఎకరాల వరకు నీరుని అలీసాగర్ వరకు అందిస్తుంది.



నిజాంసాగర్ ప్రాజెక్టు..



కనువిందు చేస్తున్న నిజాంసాగర్ ప్రాజెక్టు పరిసర ప్రాంతం

ఈ ప్రాజెక్టు ద్వారా 326 గ్రామాలు లబ్ధి పొందుతున్నాయి. ప్రాజెక్ట్ ప్రధాన కాలువ పొడవు 155 కిలోమీటర్లు. ఈ కాల్వ ద్వారా 3400 క్యూసెక్కుల నీరుని సాగుకు వదులుతారు. ఈ ప్రాజెక్టు ద్వారా 10 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. ఈ విద్యుత్‌ను ప్రధాన కాలువ ద్వారా సాగుకు నీరును వదిలినప్పుడు ఈ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. పంపిణీ కాలువలు 82, ఉపకాల్వలు 283 ఉన్నాయి. వీటి ద్వారా ఆయకట్టు చివరి రైతు వరకు ఈ ప్రాజెక్టు నీరు అందిస్తుంది. ప్రాజెక్టుకు మొత్తం 48 వరద గేట్లు కలవు. ప్రాజెక్టుపై ఆధారపడి రైతులు ఆనందంగా పంటలు పండించుకుంటున్నారు. దానితోపాటు ప్రాజెక్టులో చేపల పెంపకం ద్వారా మత్స్యకారులు చాలామంది ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు.

చివరి ఆయకట్టుకూ నీరందేలా చర్యలు



ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టులో 17.802 టీఎంసీలకు గానూ 3.096 నీరు ఉంది. రైతుల విజ్ఞప్తి మేరకు ప్రతి సంవత్సరం రైతన్నల సాగు కోసం నీటిని విడతల వారీగా వదులుతున్నాం. వానాకాలం వర్షాలు సమృద్ధిగా పడితే రెండు విడతలు యాసంగి పంటల సాగు కోసం 10 టీఎంసీల నీరును ఆరు విడతలుగా నీటిని వదులుతాం. నీటిని వృథా చెయ్యకుండా ప్రతి మండలంలోని తహసిల్దార్ కార్యాలయ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ నీటిని వదులుతాం. ఆయకట్టు చివరి రైతు వరకు నీరు అందేలా ప్రతి సంవత్సరం చర్యలు తీసుకుంటాం. **- నిజాంసాగర్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సోలమన్**

c m y k

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని ఎస్సారెస్పీ

- **పూడిక చేరడంతో 80.5 టీఎంసీలకు తగ్గిన నీటి నిల్వ సామర్థ్యం**

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరామ్‌సాగర్. కాకతీయ, లక్ష్మి సరస్వతి కెనాల్ ద్వారా ఉత్తర తెలంగాణ ప్రాంత సాగు అవసరాలు తీర్చుతోంది. అలాగే మిషన్ భగీరథలో భాగంగా కోరుట్ల-జగిత్యాల, ఆదిలాబాద్-నిర్మల్, ఆర్మూర్, నిజామాబాద్, కామారెడ్డి ప్రాంత వాసుల తాగుగోస తీరుస్తోంది. ఈ ప్రాజెక్టు 1983 నుంచి అందుబాటులోకి రాగా.. సాధారణంగా ప్రతియేటా అక్టోబర్‌లో ప్రాజెక్టులోకి పూర్తిస్థాయి నీటి సామర్థ్యం వస్తుంటుంది. అయితే పూడిక చేరడంతో ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. ఇటీవల చెన్నైకి చెందిన సంస్థ సర్వే చేపట్టగా.. నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు తగ్గినట్టు తేల్చారు. ప్రాజెక్టు నిర్మించిన సమయంలో 112 టీఎంసీలు ఉండగా.. క్రమంగా పూడిక చేరుతూ ఉండటంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతూ వస్తుంది. 1984 సమయంలో తొలిసారి నీటి నిల్వపై సర్వే చేపట్టగా.. 21 టీఎంసీల మేర తగ్గింది. కాగా రెండేండ్ల క్రితం మరోసారి సర్వే చేపట్టగా.. మరికొంత టీఎంసీలు తగ్గి ప్రస్తుతం 80.5 టీఎంసీలకు చేరింది.



ఎస్సారెస్పీ ప్రాజెక్టు

ఎస్సారెస్పీకి 4468 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులు(80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1063.20 అడుగుల(13.833 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. గతేడాది ఇదే సమయానికి 1070 అడుగుల(23.866 టీఎంసీల) నీరు నిల్వ ఉంది. తాగునీటి అవసరాల కోసం మిషన్ భగీరథకు 231 టీఎంసీ నీటిని విడుదల చేస్తున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | జులై 18, 2024 | www.navatelangana.com

నేడు రూ.లక్షలోపు రుణమాఫీ

- జిల్లాలో తొలివిడుతలో 44 వేల మంది రైతులకు మాఫీ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రైతులకు రుణమాఫీ చేసేందుకు సర్వం సిద్ధమైంది. ప్రభుత్వం తొలుత లక్షరూపాయలు లోపు రుణాలు తీసుకున్నవారివి మాఫీ చేయనుంది. దీంట్లో భాగంగా నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 44 వేలమంది రైతులకు నేడు(గురువారం) రుణమాఫీ కానుంది. తదనంతరం 15 రోజుల తర్వాత లక్షన్నర, అనంతరం రెండు లక్షల రుణం ఉన్న రైతుల పంటరుణమాఫీ చెల్లింపు చేసేలా ఏర్పాట్లు చేశారు. నేడు(గురువారం) జిల్లాలో రైతు వేదికల వద్ద సాయంత్రం 4 గంటలకి రైతులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడనున్నారు. రుణమాఫీ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు.

యూనియన్ బ్యాంక్ మేనేజర్‌పై కేసు నమోదు

- పరారీలో మేనేజర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని ఆర్‌ఆర్ చౌరస్తాలో గల యూనియన్ బ్యాంక్ మేనేజర్ అజయ్‌పై కేసు నమోదు చేశారు. బ్యాంకు కస్టమర్ల డబ్బును తన వ్యక్తిగత ఖాతాలోకి మళ్లించుకున్నాడనే విషయం తెలిసిందే. ఇట్టి విషయం ఖాతాదారులకు కూడా తెలియకుండా చేశాడు. ఫిర్యాదిదారు పుల్లూరి రాకేష్ తన లోనుకి సంబంధించి షూరిటీగా పెట్టిన రూ.20 లక్షల విలువ గల చెక్కులను వారికి తెలియకుండా బ్యాంకు మేనేజర్ అజయ్ నగదుగా మార్చుకుని వాడుకున్నాడని నిజామాబాద్ నాలుగో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని పోలీసులు బుధవారం తెలిపారు. అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ప్రస్తుతం నిందితుడు అజయ్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

సంబురాలకు సిద్ధం కావాలి

- రైతులకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి పిలుపు
- రూ.లక్ష లోపు రైతులకు నేడు రుణమాఫీ

నవతెలంగాణ-బాన్సువాడ

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగా రైతులకు 2 లక్షల రుణమాఫీ చేస్తున్న నేపథ్యంలో రైతులు సంబరాలకు సిద్ధంగా ఉండాలని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. బాన్సువాడ నియోజకవర్గంలో రైతు రుణమాఫీ సంబురాల ఏర్పాట్లపై తన నివాసంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పోచారం మాట్లాడుతూ.. 'రాష్ట్ర రైతులను రుణ విముక్తి చేయడంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు మొదటి విడతలో లక్ష రూపాయల వరకు ఉన్న రుణాలు ఉన్న రైతులకు రేపు రుణమాఫీ మొత్తం బ్యాంకులో జమ చేస్తారు. ఆగస్టు నెల లోపల రెండు లక్షల రూపాయల రైతులకు రుణమాఫీ అమలు చేస్తారు. లక్ష రూపాయల లోపు ఉన్న రాష్ట్రంలోని మొత్తం 11.50 లక్షల మంది రైతులకు రేపు రూ. 6,800 కోట్లు అందుతాయి. ఇంత భారీ మొత్తంలో రైతులకు రుణమాఫీ జరగడం గొప్ప విషయం. బాన్సు వాడ నియోజకవర్గంలో లక్ష రూపాయల వరకు ఉన్న 13,600 మంది రైతులకు లబ్ది చేకూరుతుంది. రైతు రుణమాఫీని పురస్కరించుకుని ప్రతి ఏఈవో క్లస్టర్ పరిధిలోని లబ్ది పొందిన రైతులతో రైతు వేదిక వద్ద సంబురాలు జరపాలి. ఈ సంబురాలలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొంటారు. అందుకు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేయాలని' సూచించారు.


మాట్లాడుతున్న పోచారం

అనంతరం కాసుల బాలరాజు మాట్లా డుతూ.. 'కొంతమంది హైదరా బాద్ లో కూచోని గాలి మాటలు మాట్లాడుతున్నారు. కానీ నేను, పోచారం శ్రీనివాస్ స్థానికంగా అందరికీ అందుబాటులో ఉంటూ అండగా ఉంటాం. ఆగ్రోస్ సంస్థ ద్వారా రైతులకు మేలు జరిగే విధంగా పనులు చేస్తానని' తెలిపారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి


మాట్లాడుతున్న రమేశ్‌బాబు

- ఇచ్చిన మార్గదర్శకాలల్లో నిబంధనలను సవరించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్ర ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారమిక్కడ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలో సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల దగ్గర గాని, రైతు మిత్ర గ్రూపుల వద్ద లేదా ఇతర సంస్థలతో తీసుకున్న రుణాలను చెల్లించేది లేదన్నట్టుగా నిబంధన ఉందని దీని మూలంగా పేద మధ్యతరగతి రైతులు ప్రధానంగా దళిత అట్టడుగు వర్గాల రైతాంగం పోయే ప్రమాదం ఉందని దీన్ని సవరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రెండు లక్షల పైన అప్పులు ఉన్న రైతులు ముందు వాటిని చెల్లించిన తర్వాత రైతు రుణమాఫీ జరుగుతుందని తెలపటం వల్ల రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఇప్పటికే వర్షాభావ పరిస్థితుల వలన గతంలో పంటలు పండక అప్పుల పాలైన రైతులు ఇప్పుడు వర్షాకాలం పంటలకు పెట్టుబడి పెట్టి ఇబ్బందులు పడుతున్న రైతాంగం ముందు బ్యాంక్‌లో ఉన్న అప్పును తీర్చాలంటే సాధ్యమయ్యే పని కాదన్నారు.

అందువల్ల ముందుగా ప్రభుత్వం రెండు లక్షల రుణాన్ని పంటలు వచ్చిన తర్వాత డబ్బులను రైతులు చెల్లించేటట్టు ఆదేశాలు ఇవ్వా లని కోరారు. అదే విధంగా అనే కమంది ప్రజలు ప్రజా పాలన కార్యక్ర మంలో పాసుబుక్కుల కొరకు, రేషన్ కార్డుల కొరకు దరఖాస్తులు పెట్టుకున్నప్పటికీ వారికి అందలేదని అందువల్ల రుణమాఫీకి వాటిని ఉంచాలని నిబంధన పెట్టటం సరైందికాదని వాటిని సవరించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులందరి పంట రుణాలను మాఫీ చేసేటట్టు అందరికీ రుణమాఫీ వర్తించేటట్టు నిబంధనలను విడుదల చేసి జివో ఇచ్చినప్పుడు మాత్రమే రైతులు సంతృప్తి చెందుతారని ఆయన పేర్కొన్నారు.

మేఘం కురిసే.. మంజీర మురిసే


మంజీరాకు చేరుతున్న వరద నీరు

నవతెలంగాణ-బోధన్

గత రెండు రోజులుగా కురిసిన వర్షానికి సాలురా మండల సమీపంలోని మంజీర నదిలో ఎగువ ప్రాంతం నుంచి కొత్తనీరు వచ్చి చేరింది. దాంతో ప్రస్తుతం మంజీర నది నీటితో జలకళను సంతరించుకుంది. అటువైపు సమీప ప్రాంతాల వారు వెళుతూ తిలకిస్తున్నారు. మేఘం కురిసే.. మంజీరా మురిసే అంటూ పలువురు మంజీర నదిని కొనియాడుతున్నారు. మంజీరలో కొత్తనీరు చేరడంతో గతంలో వట్టిపోయిన బోర్లు నేడు సమీప ప్రాంతాల బోర్లు భూగర్భ జలాలు పెరిగి పంటలకు నీరందిస్తున్నాయి.

యువజంట ఆత్మహత్యకు కారణమైన నిందితురాలు అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ సాయరెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నూతన దంపతులు ఆత్మహత్య చేసుకొనుటకు కారణం అయిన నిందితురాలిని అరెస్టు చేసినట్లు నిజామాబాద్ రైల్వే పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం రైల్వే పోలీస్ స్టేషన్ లో ఎస్సై సాయ రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈనెల 15వ తేదీ అర్ధరాత్రి పోతంగల్ మండలం, హెగ్డోలి గ్రామానికి చెందిన బండారి అనిల్ కుమార్, శైలజ దంపతులు ఫకీరాబాద్ మిట్టా పూర్ మధ్యలో రైలు పట్టాల పై గుర్తు తెలియని ట్రైన్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టగా.. మృతురాలు చేసిన సెల్ఫ్ వీడియో వెలుగులోకి వచ్చినట్టు తెలిపారు. సాక్షుల ఆధారంగా మృతురాలు పిన్ని కంకోళ్ళ లక్ష్మిని అరెస్టు చేసినట్టు తెలిపారు. అనంతరం రిమాండ్ కోసం హైదరాబాద్ రైల్వే కోర్టుకు తరలించామని తెలిపారు.

జీతాలు అడిగితే బెదిరింపులా..?

- గుత్ప, అలీ సాగర్ లిఫ్ట్ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

నవతెలంగాణ-నందిపేట్

మండలంలో కేంద్రంలో గుత్ప, ఆలీ సాగర్ల లిఫ్ట్ నిర్వహణ కాంట్రాక్ట్ కార్మికులు తమకు జీతాలు ఇవ్వాలంటూ బుధవారం నందిపేట్ మండల కేంద్రంలోని బస్టాండు నుంచి ర్యాలీగా బయలుదేరి ఐలమ్మ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. వద్దురా నాయన కాంట్రాక్టు పాలన, జీతాలు అడిగితే బెదిరించడమా.. సిగ్గు సిగ్గు అంటూ నినాదాలు చేస్తూ... తమ ఆవేదనను వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే... జిల్లాలోని ఈ రెండు ఎత్తిపోతల పథకాలు జిల్లా రైతుల ఎన్నో వేల ఎకరాల పంటలకు సాగునీరు అందిస్తుంది. అయితే ఎత్తిపోతల పథకం నందు పనిచేసే కార్మికులకు మాత్రం కాంట్రాక్టర్లు ఐదు నెలల నుండి వేతనాలు చెల్లించక ఇబ్బందులకు గురి చేస్తూ వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని బాధిత కార్మికులు వాపోతున్నారు. నిర్మానుష్య ప్రాంతంలో గల లిఫ్టుల వద్ద పాముల నుండి తమ ప్రాణాలను కాపాడుకుంటూ, భద్రత లేని ఉద్యోగాలను చేస్తున్నా కనీసం వేతనాలైనా సరైన టైంకు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేసిన పనికి జీతాలు చెల్లించక పోతే తమ కుటుంబాలను ఎలా సాకాలని, తాము పడుతున్న బాధలను ఎంతమంది అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పిన తమని పట్టించుకుంటలేరని వాపోయారు. ప్రజా ప్రతినిధులు మాకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి మాకు న్యాయం చేయాలని, లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని తమ జీతాలను ఇప్పించి తమను రెగ్యులర్ చేయాలన్నారు.



ర్యాలీ చేపట్టి నినాదాలు చేస్తున్న లిఫ్టు కార్మికులు

ఆశావర్కర్‌ల సమస్యలపై
నేడు ఎమ్మెల్యేల ఇండ్ల ముట్టడి

- జయప్రదం చేయండి : సీఐటీయూ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆశాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేడు ఎమ్మెల్యే ఇంటి ఎదుట ధర్నా చేపట్టనున్నట్టు ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షులు నూర్జహాన్ తెలిపారు. ఆశాలు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం డిఎంహెచ్‌ఓకి ఆశా వర్కర్ల సమస్యలపైన నేడు ఎమ్మెల్యేల నివాసం ముందు ధర్నాలలో ఆశావర్కర్లు పాల్గొంటున్నారని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18,000 ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. 2023 సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా 15 రోజులు ఆశావర్కర్లు నిరవధిక సమ్మె చేశారు. సమ్మె సందర్భంగా (09-10-2023న) హైదరాబాద్, కోఠి కమీషనర్ ఆఫీస్ ముందు వేలాది మంది ఆశావర్కర్లతో ధర్నా నిర్వహించామని తెలిపారు. ధర్నా సందర్భంగా ఆనాటి హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఆశా యూని యన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీతో చర్చలు జరిపారని, కొన్ని నిర్దిష్టమైన హామీలు ఇచ్చినట్టు గుర్తుచేశారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఐఏఎస్ ఆఫీసర్ ఆధ్వర్యంలో కమిటీ వేస్తామని వేసిన కమిటీ ఆశాల సమస్యలను పరిశీలించి ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు పంపే విధంగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారని, ఈ కమిటీ ఆశాల డిమాండ్స్ అన్నింటినీ పరిగణలోకి తీసుకుం టుందని, యూనియన్ ప్రతిని ధులతో ముఖాముఖి చర్చలు కూడా జరుపుతామని, అన్ని అంశాలు అధ్యయనం చేసి ప్రభుత్వానికి ఆశా వర్కర్ల సమస్యలపైన నివేదికను అందజే స్తామని తెలిపారని వెల్లడించారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని నేడు ఎమ్మెల్యేల ఇండ్ల ముందు ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ధర్నాలను ఆశ వర్కర్లు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమస్యలను పరిష్కారం చేయకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆశ యూనియన్ జిల్లా కోశాధికారి రేణుక జిల్లా ఉపాధ్యక్షురాలు సుకన్య, రేవతి, అనిత, గీత, గౌరీ, సుమలత తదితరులు పాల్గొన్నారు.


డీఎంఅండ్‌హెచ్‌వోకు ధర్నాకు సంబంధించిన నోటీసు అందజేత

దొంగల బీభత్సం

- వెల్మల్‌లో అర్ధరాత్రి వేళ మూడు ఇళ్లలో చోరీ
- 20 తులాల బంగారం, 18 తులాల వెండి, రూ.10 లక్షలకు పైగా నగదు అపహరణ
- ఆనవాళ్లు గుర్తుపట్టకుండా ఇళ్లలో కారంపొడి చల్లిన వైనం


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-నందిపేట్

మండలంలోని వెల్మల్ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో మూడు ఇళ్లలో దొంగలు బీభత్సం సృష్టించారు. బాధితులు, స్థానికులు తెలిపినా వివరాల ప్రకారం.... తాము ఇళ్లకు తాళం వేసి యాదగిరిగుట్టకు పోయామని ఓ కుటుంబం తెలపగా మరో రెండు కుటుంబాలు బంధువుల ఇళ్లకు పోయామని తెలిపారు. ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి ఇళ్ల తాళాలు పగులగొట్టి ఉన్నాయని లోపల ఉన్న వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయన్నారు. దొంగలు వారి ఆనవాళ్లు గుర్తుపట్టకుండా ఇంట్లో ఉన్న కారంపొడి ఇల్లంతా చల్లారని వాపోయారు. చేసిన అప్పు తీర్చుకొనేందుకు చిట్టి లేపామని ఇలా వచ్చిన పైసలు దొంగలు ఎత్తుకెళ్ళడంతో బాధితులు తలలు బాదుకుంటున్నారు. ఇప్పటికైనా రాత్రుల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని బాధితులు వేడుకున్నారు.

పోలీసులకు సమాచారం అందించడంతో స్థానిక ఎస్సై రాహుల్ ఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీం వారితో బాధితుల నుంచి వివరాలు సేకరించారు. బాధితుల ఇంట్లో ఉన్న సిసి ఫుటేజ్ ఆధారంగా చోరీలకు పాల్పడిన దొంగలను త్వరలో పట్టుకుంటామని ఎస్సై రాహుల్ తెలిపారు. 20 తులాల బంగారం, 18 తులాల వెండి, రూ.10 లక్షలకు పైగా నగదు అపహరణ గురైనట్టు బాధితులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.


డాగ్‌స్క్వాడ్ గుర్తించకుండా కారంపొడి చల్లి ఆనవాళ్లు చెరిపేసిన దుండగులు

ఏడు తరగతులకు మూడు గదులు

- సిర్పూర్ పాఠశాలలో ఆరుబయటే తరగతులు
- సొంతూరి పాఠశాలను పట్టని మాజీ ఎంపీ బీబీపాటిల్

నవతెలంగాణ-మద్నూర్

ఆ పాఠశాలలో మొత్తం 93 మంది విద్యార్థులున్నారు. ఏడవ తరగతి వరకు విద్యార్థులకు పాఠాలు బోధిస్తారు. అయితే ఏడు తరగతులకు కేవలం మూడు తరగతి గదులు మాత్రమే ఉండటంతో విద్యార్థులకు ఆరుబయటే చెట్ల కిందే పాఠాలు చెప్పాల్సిన దుస్థితి నెలకొంది. ఒక వైపు స్కూళ్లను ఆధునీకరిస్తున్నట్టు చెబుతున్నా. ఇక్కడ మాత్రం అదనపు తరగతి గదులు నిర్మించకపోవడం గమనార్హం. పదేండ్ల పాటు ఎంపీగా ఉన్న బీబీపాటిల్ సొంతూరు సిర్పూర్‌లో స్కూల్ దుస్థితి ఇలా ఉండటం గమనార్హం.

మద్నూర్ ఉమ్మడి మండలంలో నూతనంగా ఏర్పడిన డోంగ్లి మండల పరిధిలోని సిర్పూర్ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల ఏడవ తరగతి వరకు ఉంది. ఇక్కడ ఏడు తరగతులు మూడు గదులు ఉన్నాయి. ప్రస్తుతం 93 మంది విద్యార్థులు పాఠశాలలో చదువుకుంటున్నారు. గదులు లేక ఉపాధ్యాయులు పాఠశాల ఆరుబయట చెట్ల కిందనే విద్య బోధన చేపడుతున్నారు.

సిర్పూర్ గ్రామం రాజకీయంగా గల్లీ నుండి ఢిల్లీ వరకు గుర్తింపు పొందింది. ఎందుకంటే ఈ గ్రామ నివాసి బీబీపాటిల్ రెండుసార్లు జహీరాబాద్ ఎంపీగా గెలుపొందారు. ఇక ఎంపీపీ పదవుల్లో రెండుసార్లు కొనసాగిన వారు సైతం ఇదే గ్రామానికి చెందిన వారు కావడం గమనార్హం. ఇలాంటి రాజకీయంగా పేరు ప్రతిష్టలు పొందిన సిర్పూర్ గ్రామంలో విద్యాభివృద్ధి చూస్తుంటే నోటిమీద వేలు వేసుకునే విధంగా కొనసాగుతుంది.


కార్యాలయంలోనూ తరగతి నిర్వహణ

ఏడు తరగతులు కొనసాగుతుండగా.. కేవలం మూడు గదులు మాత్రమే ఉన్నాయి. వాటిల్లో ఒకటి ఆఫీసు కార్యాలయానికి ఉపయోగించినప్పటికీ ఆ గదిలో సైతం తరగతులు నిర్వహిస్తున్నారు. అవి కూడా సరిపోకపోవడంతో ఆరుబయట నేలపైనే కూర్చొబెట్టి తరగ తులు నిర్వహిం చాల్సిన దుస్థితి నెలకొంది.

సోమ వారం నవ తెలంగాణ సిర్పూర్ గ్రామాన్ని సందర్శించి ఆ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలను పరిశీలించగా ఆరుబయటే చెట్ల కింద నేల పైన కూర్చోబెట్టి విద్యా బోధన జరుపుతున్న దృశ్యాలు కనిపించాయి. రాష్ట్రంలో మారుమూల ప్రాంతమైన జుక్కల్ నియోజకవర్గంలోని నూతనంగా ఏర్పడిన డోంగ్లి మండలంలో సిర్పూర్ గ్రామ పాఠశాల పరిస్థితి విద్యా బోధన చదువుకునే విద్యార్థులకు ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. చాలీచాలని గదులతో ఉపాధ్యాయులు విద్య బోధన కొనసాగిస్తున్నారు. ఈ గ్రామం నుండి ఎంపీగా గెలిచిన ఎంపీపీలుగా గెలిచిన గ్రామంలో గల పాఠశాల అభివృద్ధికి ఏమాత్రం చొరవ చూపలేదు అనడానికి ఆరుబయట చెట్ల కింద నేలపైన చదువులు నేర్పే దృశ్యాలే నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఇప్పటికైనా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ మారుమూల ప్రాంత విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టి విద్యార్థులకు గదుల కొరత లేకుండా చూడాలని ఆ గ్రామ విద్యార్థుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.


తరగతి గదులు లేక వరండాలో, చెట్ల కింద పిల్లలకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ
నిజామాబాద్
గురువారం | జులై 18, 2024 | www.navatelangana.com

కులాస్‌పూర్‌లో లార్వా సర్వే



ఇంటిటా లార్వా సర్వే చేస్తున్న వైద్యులు, సిబ్బంది

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కులాస్‌పూర్ గ్రామంలో ఇంటింటి తిరిగి లార్వా సర్వే బుధవారం నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆశిష్ మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రజలందరూ తమ చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమతెరలు వాడాలని, నిల్వ ఉంచిన నీటిని నిరంతరం పారబోయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఆశిప్రాజ్, సుశాంత్, వెంకటేష్, ప్రత్యూష, ఆస్పత్రి సిబ్బంది వినోద, వనజ, పద్మ, సుప్రియ, నాని, బాబు, పాల్గొన్నారు.

ప్రాణ స్నేహితునికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

మండలంలోని అర్గుల్ గ్రామానికి చెందిన ఎస్ఎస్సి ప్రాణ స్నేహితునికి మిత్రులు ఆర్థిక సహాయాన్ని బుధవారం అందించారు. మండలం అర్గుల్ గ్రామ జడ్పీహెచ్ఎస్ స్కూల్ 1997- 98 బ్యాచ్‌కు చెందిన మిత్ర బృందం తమతో పదో తరగతి వరకు చదివి సంవత్సరం కింద మరణించిన తమ ప్రాణ మిత్రుడు షాదుల్లా కుటుంబం దీనస్థితిలో ఉందని తెలుసుకొని వారి కుటుంబానికి 37,500 రూపాయలు ఆర్థిక సహాయం అందించామని ఆయన మిత్రుడు తెలియజేశారు. స్నేహితుని కుటుంబానికి మేమున్నామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో చింత మహేష్ (టిఆర్ఎస్), సంఘం మహిపాల్ , పెద్ది రాజు, ప్రవీణ్ కుమార్, బేల్దారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న పలువురు

నవతెలంగాణ-మోపాల్

హైదరాబాదులో జరిగిన అండర్ 23 రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో నిజామాబాద్ జిల్లా మంచిప్ప గ్రామానికి చెందిన ఎస్కే నేహా, భీంగల్ గ్రామానికి చెందిన సిఱ్రా మెహవీన్ బంగారు పతకాలు సాధించారు. వారిని నిజామబాద్ జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు భక్తవత్సలం, నిజామబాద్ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ నర్సింగ్ రావు, ఉపాధ్యక్షులు జయపాల్, రాజ్ కుమార్ సుబేదార్, సురేష్ అభినందించారు. కోచ్ దేవేందర్‌ని భక్తవత్సలం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని కోరారు.

సన్మాన సభకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త తరలిరావాలి

- మండల అధ్యక్షుడు బొదిరే స్వామి

నవతెలంగాణ-భీంగల్



మాట్లాడుతున్న బొదిరె స్వామి

ఇటీవల నామినేటెడ్ పదవులు చేపట్టిన మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, కిసాన్ ఖేత్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్ రెడ్డిలకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 19న పట్టణ కేంద్రంలోని సహస్ర ఫంక్షన్ హాల్ లో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు కనుక నియోజకవర్గంలోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త తరలి రావాలని భీంగల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొదిరే స్వామి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రివర్యులు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ రమేష్ రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి బాల్కొండ నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని స్వామి పిలుపునిచ్చారు.

తాకట్టు పెట్టి తీసుకున్న లోన్ రెండు లక్షలు మాఫీ చేయాలి : సీపీఐ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బ్యాంకుల్లో వ్యవసాయంకోసం తీసుకున్న పంట క్రాఫ్, బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న లోన్ రెండు లక్షల రూపాయల రుణాలను మాఫీ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ రైతన్నకి ఇచ్చిన హామీ ప్రకారం రైతులందరికీ రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని అన్నారు. రైతాంగం వివిధ రకాల పంటల క్రాప్ లోన్, వ్యవసాయ పనుల నిమిత్తం బంగారం తాకట్టు పెట్టి బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు కూడా మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలోసిపిఐ జిల్లా నాయకులు ఏ.విటల్ గౌడ్, బి రఘురాం, రంజిత్, గంగాధర్ పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్‌రెడ్డిని, మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. బిఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ పార్టీ నేతగా నియామకమైనందుకు హర్షం వ్యక్తం చేస్తూ సురేష్‌రెడ్డిని, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

తడపాకల్ రామాలయంలో ఘనంగా తొలి ఏకాదశి

నవతెలంగాణ-ఏర్గట్ల /మాక్లూర్


మండలంలోని తడపాకల్ గ్రామంలో తొలి ఏకాదశి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. భక్తులు గోదావరి నదిలో స్నానం ఆచరించి, ఎలికేశ్వర రామాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు కృష్ణాచారి మాట్లాడుతూ...ఏకాదశి రోజున శ్రీ మహా విష్ణువును పూజిస్తూ..ఉపవాస దీక్ష పాటిస్తే విశేష ఫలితాలు కలుగుతాయని అన్నారు.

మాక్లూర్ :మండల కేంద్రంలోని శ్రీ రుక్మిణీ సహిత విఠలేశ్వర ఆలయంలో నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గ్రామస్థులతో కలిసి పూజలు నిర్వహించారు. వాహనాలు చేశారు. పూలు, పుదీనా సమర్పించి, అలంకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే..

నవతెలంగాణ-మాక్లూర్



మృతిచెందిన గేదె

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యుత్ షాక్ తో గేదె మృతి చెందిందని, అదే మనిషి మృతి చెందితే ఎలా అని స్థానికులు విద్యుత్ అధికారులను ప్రశ్నిస్తున్నారు. మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో విద్యుత్తు తీగలు కింద పడి ఉండటంతో మేతకు వెళ్లిన గేదె విద్యుత్ షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందింది. ఈగేదె గొట్టుముక్కల గ్రామానికి చెందిన గొల్ల మహిపాల్‌ది. దీని విలువ సుమారు రూ. 95 వేలు ఉంటుందన్నారు. విద్యుత్ తీగలు కిందికి వేలాడటంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. బాధితతునికి నష్ట పరిహారం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

కళాకారులకు సారధిలో ఉద్యోగాలు ఇవ్వాలి

- ఉమ్మడి జిల్లాలో వంద ఉద్యోగాలు ఇవ్వాలి
- నిరుద్యోగ కళాకారుల జిల్లా అధ్యక్షులు చిట్టి బాబు



సమావేశంలో మాట్లాడుతున్న చిట్టిబాబు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కళాకారులకు సారధిలో ఉద్యోగాలు ఇవ్వాలని నిరుద్యోగ కళాకారుల జిల్లా అధ్యక్షులు చిట్టిబాబు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గౌతంనగర్ ఎన్‌జీఓఎస్ కాలనీలోని ఆంజనేయులు స్టూడియోలో తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం కోసం గోసి, గొంగడి వేసుకొని కాలికి గజ్జలు కట్టుకొని ఊరూరా తిరిగి ఉద్యమ స్ఫూర్తిని రగిలించామన్నారు. ఉద్యమం కోసం చేస్తున్న ఉద్యోగాలను సైతం వదిలేసి, భార్య పిల్లలకు దూరంగా ఉంటూ ఎన్నో కష్టాలు పడి "ధూమ్ దాం"లు నిర్వహించామని తెలిపారు. తెలంగాణ వచ్చేవరకు నిరంతరాయంగా పనిచేశామని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ 550 మందికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. కానీ సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ డబ్బులకు అమ్ముడు పోయి, వారికి నచ్చిన వారికి అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చారని, అర్హులకు అన్యాయం చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అర్హులైన కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలని అన్నారు. ప్రస్తుతం మా కుటుంబాలు దీనవస్థలో ఉన్నాయని, పదేళ్లుగా రాష్ట్ర మంత్రులు, జిల్లా మంత్రులకు ఎన్నో సార్లు వినతి పత్రాలు అందించామని, అయినా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. ఇకనైనా కాంగ్రెస్ ఉమ్మడి నాయకులు ఎమ్మెల్యేలు కళాకారుల బాధలను అర్థం చేసుకొని ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో 26 ఉద్యోగాలు ఇచ్చారని, ఇతర జిల్లాలతో సమానంగా ఉమ్మడి జిల్లాలో వంద ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో దేగావత్ గణేష్, మాడ వేడి ఆంజనేయులు, సబావత్ గోపాల్ కర్క (వాడి)రమేష్, మహేందర్, సంజీవ్, దప్పుస్వామి, సద్గురు, దేవరాజ్, శ్రీనివాస్, కిష్టయ్య, రమేష్, సింగరాయపల్లి సాయిలు, శంకర్‌గౌడ్, వెంకన్న, కిషన్, శ్యామ్, అశోక్, శ్రీను, రాము, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సహారా ఇండియా కంపెనీ డబ్బులు చెల్లించాలి

- ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు

నవతెలంగాణ-సిరికొండ



సమావేశంలో మాట్లాడుతున్న దాసు

దేశంలో 12 కోట్ల మంది పేద, మధ్య తరగతి ప్రజలు సహారా ఇండియా కంపెని సంస్థలో పొదుపు చేసుకున్న రూ.86 వేల కోట్ల డబ్బుల్ని తిరిగి చెల్లించకుండా కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని, కనుక కేంద్ర ప్రభుత్వం సహారా బాధితులకు వెంటనే డబ్బులు చెల్లించి ఆదుకోవాలని ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు ప్రధానమంత్రి నరేంద్ర మోడీని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దాసు మాట్లాడుతూ.. పిల్లల చదువులకు, పెళ్లిళ్లకు ఉపయోగపడుతుందని సహారా బ్యాంకులో పొదుపు చేసుకున్నారన్నారు. కంపెనీతో కుమ్మక్కై, కేంద్ర బిజెపి పార్టీ కోట్లాది ప్రజల జీవితాలతో చెలగాటమాడుతుందని ఆయన తెలిపారు.

డబ్బులు రానందున వేలమంది ఖాతాదారులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆయన అన్నారు. సుప్రీంకోర్టు ఖాతాదారుల డబ్బులు చెల్లించాలని 2023లో ఆదేశాలు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయని తెలిపారు. ఆన్లైన్ ద్వారా చెల్లిస్తామని పోర్టల్ ప్రారంభించిన కేంద్ర మంత్రి అమిత్‌షా ఈరోజువరకు 86 వేల కోట్లకు కేవలం 500 కోట్లు మాత్రమే చెల్లించారని, దీనికే సంవత్సరం నరకాలం పడుతుందంటే 86 వేల కోట్ల పైసలు చెల్లించడానికి ఎన్ని దశాబ్దాలు పడుతుందని ఆయన ప్రశ్నించారు. 12 కోట్ల మంది ఖాతాదారుల కుటుంబంతో పది లక్షల మంది ఏజెంట్ల జీవితాలతో చెలగాటమాడటం సరికాదని ఆయన అన్నారు . పార్లమెంటు ఎన్నికల్లో బహిరంగ సభలలోను సహారా ఖాతాదారులకు డబ్బులు చెల్లిస్తామని హామీ ఇచ్చిన అమిత్‌షా ఇప్పుడు మాట్లాడలేకపోవడం సిగ్గుచేటని అన్నారు. సహారా కంపెనీతో అమిత్ షా కుమారుడు, బిజెపి పార్టీ నాయకులకు ఆర్థిక సంబంధాలు ఉండడం మూలంగానే ప్రజలకు డబ్బులు చెల్లించడంలో కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆయన విమర్శించారు. పోర్టల్ ఆన్లైన్ ద్వారా కాకుండా నేషనల్ బ్యాంకు ద్వారా చెల్లించాలని డిమాండ్ చేశారు. నోరు విప్పితే హిందూ జపం చేసే అమిత్‌షాకు సహారా బాధితుల్లో హిందువులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సమావేశంలో ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు పద్మ, ఆర్మూర్ ఎల్ఐసి బ్రాంచ్ కార్యదర్శి వి.బాలయ్య, పివైఎల్ సిరికొండ మండల అధ్యక్షులు సంజీవ్, ఏఐకేఎంఎస్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి మార్క్స్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఒక వ్యక్తి అదృశ్యమైనట్టు ఒకటవ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ విజయ్‌బాబు బుధవారం తెలిపారు. ఎస్‌హెచ్ఓ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలంలోని తెలుపుగొండ గ్రామానికి చెందిన మంగలి సంగయ్య వయసు (50) గత నాలుగు రోజుల నుంచి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నందు అడ్మిట్ అయిఉన్నాడు. ఈ క్రమంలో 16న ఉదయం 7.30 గంటలకు బాత్రూంకి వెళ్ళొస్తానని అతని భార్యకు చెప్పి వెళ్లాడు. అయితే తిరిగి రాలేదు, కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు తిరిగి ఆచూకీ ఎక్కడ తెలియలేదని, పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతను కోల ముఖం, చామన చాయ రంగు, తెలుగులో మాట్లాడతారని కుటుంబ సభ్యులు తెలిపారని పోలీసులు తెలిపారు. హాస్పిటల్ నుంచి వెళ్ళినప్పుడు అతను బ్లూ కలర్ షర్ట్, లుంగీ కట్టుకున్నాడు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిసినచో నంబర్ 8712659837కి సమాచారం ఇవ్వగలరు అని ఎస్‌హెచ్ఓ విజయ్ బాబు తెలిపారు.

మేస్త్రి పనిచేస్తుండగా కిందపడ్డ కూలి

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రంలో బాలయ్య అను వ్యక్తి రోజు కూలి నిమిత్తం మేస్త్రీ పనిచేస్తున్నాడు. ఈక్రమంలో బుధవారం పైఅంతస్తు నుండి జారి కింద పడ్డాడు. ఈయన బోర్గాం పరిధిలోని గూడెంలో నివాసం ఉంటున్నాడు. వెంటనే ఆసుపత్రికి తరలించారని, ఎటువంటి ప్రమాదం లేదని స్థానికులు తెలిపారు.

నగరంలో యువకుడి హత్య



ఘటనాస్థలంలో వివరాలు సేకరిస్తున్న సీఐ

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో ఓ షాపు ముందు మంగళవారం రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురైనట్టు పట్టణ సీఐ నరహరి బుధవారం తెలిపారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం..గుర్తుతెలియని మృతిచెందినట్టు సమాచారం రావడంతో వినాయక్‌నగర్‌లోని వైన్‌షాప్ వద్దకు పోలీసులు చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించగా గుర్తుతెలియని వ్యక్తులు తలమీద కొట్టడంతో మృతిచెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మరణించిన వ్యక్తి గురించి విచారణ చేపట్టగా మృతుడు బీహార్‌కు చెందిన ఆనంద్ బిహారి పాండే (22). నిజామాబాద్‌లో అంగిటీ వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఒక భవనంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేసేవాడని తెలిపారు. మంగళవారం రాత్రి తలనొప్పిగా ఉంది మెడికల్ షాప్‌కి వెళ్లి వస్తానని వాళ్ళ రూంమెంట్స్‌తో చెప్పి బయటికి వెళ్లాడు. వైన్ షాప్‌వద్ద మద్యం సేవించి, తిరిగి వారి రూమ్‌కి వెళ్లలేదని విచారణలో తేలిందని తెలిపారు. హత్యకు గల కారణాలు, హంతకుల వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ఆ కోణంలో కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మాధవ్‌నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు తనిఖీ

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్



పనుల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ రూరల్ మండలంలోని మాధవ నగర్‌లోని రైల్వే బ్రిడ్జి పనులను ఆర్అండ్ ఎస్‌సి, డిఈ అధికారుల సమక్షంలో నిజామాబాద్ రూరల్ డాక్టర్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు మొత్తం విలువ 93 కోట్ల అయితే రాష్ట్ర ప్రభుత్వం రూ.63 కోట్లు, కేంద్ర ప్రభుత్వం రూ.30 కోట్లతో పనులు సాగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఉండడం వల్ల కొంచం ఆలస్యం జరుగుతుందని, వచ్చే సంవత్సరం 2025 మే నాటికి పూర్తి చేయాలని, దాదాపు ఆ దిశగానే పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను సాధ్యమైనంత మేర త్వరగా తెప్పించి దీనిని త్వరగా పూర్తిచేసే ఏర్పాట్లు చేస్తున్నానని అన్నారు. అలాగే ఈ బ్రిడ్జి కొనసాగుతున్నంత సేపు ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా అప్రోచ్ రోడ్డుని కూడా మరమ్మతులు చేసి రవాణాకు సుగమం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ బ్రిడ్జితో పాటు అర్సపల్లి రైల్వే బ్రిడ్జిలు కూడా త్వరగా పూర్తిచేసే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. దాని బడ్జెట్ విలువ 137 కోట్లు ఇది కూడా కొంచెం కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉందని, రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సి నిధులను వెంటనే తెప్పించి ఈ బ్రిడ్జిని త్వరగా పూర్తిచేసే ప్రయత్నం చేస్తానని అన్నారు. బ్రిడ్జి 2025 సెప్టెంబర్ నాటికి పూర్తి కావాల్సింది ఇప్పటికే 30శాతం పనులు పూర్తయ్యాయి. సెప్టెంబర్ నాటికి పూర్తయ్యే విధంగా పనులను కొనసాగుతూ ఉన్నాయని తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్‌గా నేరెళ్ల శారద



నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్‌గా నేరెళ్ల శారద బాధ్యతలు స్వీకరించి ప్రమాణ సకారం బుధవారం చేశారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన టీజీఎండీసీ చైర్మన్ అనిల్ ఈరవత్రి, తెలంగాణ సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డిలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

దశల వారి పోరాటాల ఫలితంగానే జీపీ కార్మికుల బకాయి వేతనాల నిధులు విడుదల

- పోరాడి సాధించిన కార్మిక వర్గానికి విప్లవ జేజేలు
- భారతకార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ)

నవతెలంగాణ-సిరికొండ

దశలవారీ పోరాటాల ఫలితంగానే గ్రామపంచాయతీ కార్మికుల బకాయి వేతనాల చెల్లింపులకోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, పోరాడిన గ్రామ పంచాయతీ వర్కర్స్‌కు భారతకార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) జిల్లా కార్యదర్శి రమేష్ విప్లవ అభినందనలు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో పెండింగ్ జీతాల కోసం,సమస్యల పరిష్కారం కోసం గ్రామంనుండి జిల్లా స్థాయిలలో అనేక సార్లు పోరాటాలు నిర్వహించామన్నారు. డిపిఓ, కలెక్టర్ నిధులు లేవు.. మేమేం చేయలేమని చేతులెత్తేయగా ఈనెల 5న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయం ముందు ర్యాలీలు, ధర్నాలు నిర్వహించామని తెలిపారు. మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చామని అన్నారు. ఈనెల 11న చలో హైదరాబాద్ రాష్ట్ర పంచాయతీ రాజ్ కార్యాలయాన్నికి ముట్టడించామని తెలిపారు. పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ వెస్లీకి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించామని అన్నారు. పెండింగ్ వేతనాలు, డిమాండ్స్‌పై స్పష్టమైన హామీ రాకపోతే ఇక్కడే బైటాయిస్తామని అనడంతో 12 డిమాండ్లపై డిప్యూటీ కమిషనర్ వెస్లీ స్పష్టమైన హామీఇచ్చారన్నారు. పెండింగ్ జీతాలు 10 రోజుల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈమేరకు ఈనెల 12న రాష్ట్రంలోని 29676 మంది పంచాయతీ వర్కర్లకు 150 కోట్ల 57 లక్షలు రూపాయలు గ్రాంట్ రిలీజ్ చేశారన్నారు. జిల్లా పంచాయతీరాజ్ అధికారులు, కలెక్టర్ వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించడం కోసం చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో (సీపీఐఎంఎల్) మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ నాయకులు దామోదర్, సాయరెడ్డి, మండల నాయకులు రమేష్, కిషోర్, పీడీఎస్‌యూ ఆర్మూర్ డివిజన్ నాయకులు ఆశిష్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతి

నవతెలంగాణ-బాల్కొండ



పృథ్వీరాజ్ (ఫైల్)

ట్రాక్టర్ బోల్తా పడి ఓ యువకుడు మృతి చెందిన విషాదకర సంఘటన బుధవారం బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. నాడిపూర్ గ్రామానికి చెందిన బ్రహ్మ పృథ్వీరాజ్ (21) ట్రాక్టర్ నడుపుతుండగా ప్రమాద వశాత్తు ట్రాక్టర్ బోల్తా పడడంతో మృతి చెందాడు. మృతుని తండ్రి పురుషోత్తం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మొహమ్మద్ యాసీర్ అరాఫత్ తెలిపారు. యువకుని మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గర్భిణీకి రక్తదానం చేసిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు

నవతెలంగాణ-కామారెడ్డి



కామారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భవాని అనే గర్భిణీకి ఆపరేషన్ నిమిత్తం బి పాజిటివ్ రక్తం అవసరం కావడంతో వారి కుటుంబ సభ్యులు జిల్లా రక్తదాతల సేవాసమితి నిర్వాహకులను సంప్రదించడంతో కామారెడ్డి పట్టణంలోని ఒక ప్రైవేట్ స్కూల్లో విద్యార్థులకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడు స్వామి సహకారంతో వారికి కావలసిన బి పాజిటివ్ రక్తం సకాలంలో అందజేసినట్టు రక్తదాతల సేవా సమితి నిర్వాహకులు అన్నారు. ఈ సందర్భంగా సేవా సమితి నిర్వాహకులు మాట్లాడుతూ.. రక్తందానం చేస్తే మళ్లీ రక్తం వస్తుంది కానీ, రక్తం అందకపోయిన ప్రాణం తిరిగి రాదు అని తెలిపారు. కార్యక్రమంలో కేబీఎస్ బ్లడ్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని తిమ్మారెడ్డి, జానకంపల్లి, కుర్దు గ్రామాలలో రేషన్ డీలర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆర్డీవో మన్నే ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తిమ్మారెడ్డి, జానకంపల్లి, కుర్దు గ్రామాలలో రెండు పోస్టులు జనరల్ మహిళకు కేటాయించినట్టు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 30వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా స్థానిక ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. దరఖాస్తులు చేసుకునే అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, తప్పనిసరిగా నిరుద్యోగులై ఉండాలని, 18 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలని, ఎలాంటి నేర చరిత్ర లేని అభ్యర్థులు తమ అర్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లను దరఖాస్తుతో జత చేసి అందజేయాలని తెలిపారు.



లింగంపేట్: పీర్ల వద్ద ప్రార్థనలు చేస్తున్న గ్రామస్తులు



గాంధారిలో షర్బత్ పంపిణీ..



ఎడపల్లిలో పీర్ల ఊరేగింపు

ఘనంగా పీర్ల పండుగ

నవతెలంగాణ-విలేకరుల బృందం

పిట్లం : కులమతాలకు అతీతంగా భావించే మొహర్రం (పీర్ల పండగను) హిందూ, ముస్లింలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో బీబీ ఫాతిమా పెద్ద పీరును భక్తి పాటలు, మజ్నూ హాస్య నాటికలతో ఆయా గ్రామాల ప్రధాన వీధులలో శోభాయాత్ర నిర్వహించగా.. ప్రజలు బెల్లం, చక్కెరను నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. మండలంలోని బ్రాహ్మణపల్లి, కిష్టాపూర్, బుర్నాపూర్, ధర్మారం, గౌరారం గ్రామాలలో ఏ ఒక్క ముస్లిం కుటుంబాలు లేనప్పటికీ హిందువులే ప్రత్యేక చొరవ చూపి సాంప్రదాయబద్ధంగా అగర్‌ఖాన్, బీబీ ఫాతిమా (పెద్ద పీర్ల) ప్రతిమలను అందంగా అలంకరించారు. ఆయా గ్రామాల వీధులలో శోభయాత్ర నిర్వహించి గ్రామ సమీపంలోని చెరువు, వాగులు, కుంటల వద్దకు తీసుకెళ్లి నీళ్ల చల్లి నిమజ్జనం నిర్వహించారు. ఈ పండగలలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బోధన్ : త్యాగానికి ప్రతీక అయిన మొహర్రం పండగను పురస్కరించుకొని బుధవారం సాలురా, కల్దుర్కి గ్రామాలలో మైనార్టీలు మొహరం పండుగను ఘనంగా జరుపుకున్నారు. గత వారం రోజులుగా గ్రామాలలో పీరీలను ప్రతిష్టించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బుధవారం గ్రామాలలో పీరీల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. పీరిల ఊరేగింపు కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని పీరిలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో మైనార్టీ పెద్దలు యూసుఫ్, సయ్యద్, జాఫర్, మోహినుద్దిన్, ఖదీర్,ఖాజా, షేక్ మౌలా తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని లింగంపల్లి, కల్వరాల్, వజ్జపల్లి, ధర్మారావుపేట్, మోడేగాం తదితర గ్రామాల్లో పండగను ఘనంగా నిర్వహించారు.

లింగంపేట్ : మండల కేంద్రంలో హిందువులు ముస్లింలు పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. బియ్యం, కుడుకలు, దటీలు, పువ్వులు, చక్కెర, బెల్లం సమర్పించి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా పీర్ల ఊరేగింపు కొనసాగింది.

ఎడపల్లి : మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో పీర్ల పండగను మైనార్టీలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన వీధులలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం డప్పు వాయిదాల మధ్య పీర్లను మైనార్టీ సోదరులు అబ్బాయ్య దర్గా వద్ద గల చెరువులో నిమజ్జనం చేసిన అనంతరం పీర్లను మసీదులో భద్రపరుస్తామని మైనార్టీ సోదరులు తెలిపారు.

పెద్ద పీర్ల ఉత్సవాలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే..

జుక్కల్ : మండలంలోని డోన్గాం స్వగ్రామంలోని పెద్దపీరు ఉత్సవాలలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సరదాగా గడిపారు. ప్రతి ఒక్కరికి పేరుపేరునా పలకరించి వారి కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని మసీదు వద్ద గల పెద్ద పీరు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సూర్యకాంత్ పటేల్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

షర్బత్ పంపిణీ..

గాంధారి : మండల కేంద్రంలోని రెండు మసీదులలో మొహర్రం పండుగను పురస్కరించుకొని మాజీ మండల కో ఆప్షన్ మెంబర్, మజీద్ కమిటీ అధ్యక్షుడు ముస్తఫా ఆధ్వర్యంలో షర్బత్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులు, మైనారిటీలు తదితరులు పాల్గొన్నారు.



బోధన్‌లో...



పిట్లంలో...



జుక్కల్‌లో...

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-దోమకొండ

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీని వారి ఖాతాలలో గురువారం నుంచి జమ చేయనున్నట్టు మాజీ జెడ్పిటిసి తీగల తిరుమలగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అనంతరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి తీర్మాల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అనంతరెడ్డి మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలలో రాహుల్ గాంధీ రైతుల కోసం 2లక్షల రుణమాఫీని అమలు చేయాలనే పథకాన్ని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందపరిచారని, దానికి అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి తన క్యాబినెట్ సమావేశంలో రుణమాఫీని ఆమోదించేందుకు నిర్ణయం తీసుకున్నారని వివరించారు. నేటి నుంచి రూ.లక్ష చొప్పున రైతుల ఖాతాలలో జమ చేయనున్నట్టు వివరించారు. విడతలవారీగా ఆగస్టు 15వ తేదీలోపు రైతులకు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణాన్ని మాఫీ చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కంకణం కట్టుకున్నారని తెలిపారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందనే ఉద్దేశంతో రైతులకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు వివరించారు. గురువారం రైతులు సంబరాలు చేసుకోవాలని సూచించారు. రైతులు తమ ఖాతాలను బ్యాంకులకు వెళ్లి చెక్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వానికి సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు సీతారాం మధు, డిసిసి జనరల్ సెక్రెటరీ తాటిపల్లి శ్రీకాంత్, నల్లపు శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, అబ్రబోయిన రాజు, నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణపై అవగాహన

- ఒకరికి డెంగ్యూ నిర్ధారణతో కదలిన అధికారులు



మురికి నీరును పారపోస్తున్న అధికారులు

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎనిమిదవ వార్డులో ఒకరికి డెంగ్యూ వ్యాధి నిర్ధారణ కావడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వినయ్ కుమార్‌తో పాటు వైద్య సిబ్బంది ఆ వార్డును సందర్శించి ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు. డెంగ్యూ సోకిన వారి ఇంటి చుట్టూ 100 ఇండ్లలో పేరి డొమెస్టిక్ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, నీటి నిల్వ ఉండకుండా చూడాలని వారు సూచించారు. వారానికోసారి నీటి తొట్టిలను శుభ్రపరచుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, వైద్యాధికారి శ్రావణ్ కుమార్, వైద్య సిబ్బంది విజయ చిన్నయ్య, రామకృష్ణ, ఆరోగ్య సిబ్బంది స్వప్న ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీ వర్షం.. నీటి మునిగిన పంటలు



వర్షానికి నీటమునిగిన పంట

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పంట పొలాలు నీటి మునిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 85.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వరి పంట మునిగిపోయింది. సుమారు 70 ఎకరాల పంట పొలాల్లో నీరు చేరడంతో రైతులకు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జనసంచారంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- ఇప్పటికే మూడు ఆవులు మృత్యువాత

నవతెలంగాణ-నసురుల్లాబాద్

విద్యుత్ తీగలు నేలకు తాకుతూ చెట్ల కొమ్మల గుండా వెళ్తున్నా పట్టించుకోవడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. నసురుల్లాబాద్ మండలంలోని నెమ్లి గ్రామంలోని సాయిబాబా మందిరం కల్యాణ మండపం వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ భూమికి దగ్గరగా ఉండడం, తీగలు కిందికి వేలాడుతుండటంతో వారం రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన ఓ రైతుకు చెందిన మూడు ఆవులు మృతిచెందాయి. ట్రాన్స్‌ఫార్మర్ పక్కనుంచి కల్యాణ మండపానికి దారి ఉండడంతో వారానికి రెండు మూడు శుభ కార్యక్రమాలు జరుగుతాయి. వందల సంఖ్యలో జనాలు ఈ కార్యక్రమాలకు వస్తున్నప్పటికీ ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్య ధోరణితో ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి అప్పుడప్పుడు మెరుపులు వస్తున్నాయి. దీంతో ప్రజలకు పశువుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. ఆయా గ్రామాల్లో విద్యుత్ తీగలు చేతికి అందేలా ఉన్నాయి. ప్రమాదం సంభవించిన తర్వాత దిద్దుబాటు చర్యలకు లేదా ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం కన్నా నివారణ చర్యలు చేపట్టడం మంచిదని ప్రజలు అంటున్నారు. విద్యుత్ శాఖ అధికారులు బిల్లులు వసూలుపై ఉన్న శ్రద్ధ సమస్యలు పరిష్కరించడంలో లేదని గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. వెంటనే విద్యుత్ సమస్యలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఆవు (ఫైల్)

సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో ఎమ్మార్పీఎస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చిత్రపటాలకు బుధవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు డల్ల సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేసినట్టు వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో తెలంగాణ రైతాంగానికి ఇచ్చిన హామీ నెరవేర్చడం గర్వించదగ్గ విషయమన్నారు. కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల కోసం పనిచేసే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఒక్క లక్ష రూపాయల ఋణం రేపటి వరకు రైతు ఖాతాలో జమ అవుతాయని అందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, సన్న, చిన్నకారు రైతులు కాంగ్రెస్ పార్టీకి ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు గంగాధర్, మాజీ టౌన్ అధ్యక్షులు షేక్ సాయిలు, సీనియర్ నాయకుడు బాషోల్ల సాయిలు, బండారిపల్లి తిరుపతి, అంబేద్కర్ కాలనీ పెద్దలు యువకులు పాల్గొన్నారు.



నేడు రుణమాఫీ సంబురాలు

- మండల వ్యవసాయాధికారులు

నవతెలంగాణ-మద్నూర్/ఎడపల్లి/వర్ని

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 18 నుంచి వ్యవసాయ రైతులకు లక్షలోపు రుణాల మాఫీ ప్రారంభిం చనుంది. ఈ కార్యక్రమం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు రుణమాఫీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని మద్నూర్ ఉమ్మడి మండల వ్యవసాయ అధికారి రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పరంగా ప్రతి మండలంలో రుణమాఫీ సంబరాలు జరుపనున్నట్లు పేర్కొన్నారు.

ఎడపల్లి/వర్ని : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రుణమాఫీని గురువారం ప్రారంభించనున్నట్లు, అలాగే రైతులు బ్యాంకుల ద్వారా తీసుకున్న పంట రుణాల క్రాప్‌లోన్ లక్ష రూపాయల లోపు ఉన్న వారందరికీ రుణమాఫీ కార్యక్రమం ఎడపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమవుతుందని ఎడపల్లి మండల వ్యవసాయశాఖ అధికారి సిద్ధి రామేశ్వరరావు తెలిపారు. చందూర్‌లోని రైతు వేదికలో సంబురాలు చేపట్టనున్నట్టు ఏఈవో సౌజన్య తెలిపారు. రైతులతో ముఖాముఖి వీడియో కాన్ఫరెన్స్‌లో లబ్ధిదారులతో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి మాట్లాడనున్నట్లు తెలిపారు. రైతులు నేరుగా రైతు వేదిక వద్దకు వచ్చి ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించవచ్చని ఆయన కోరారు. రుణమాఫీ డబ్బులు విడుదలైన రోజునే రైతు వేదికల్లో రుణమాఫీ లబ్ధిదారులతో సంబరాలు జరుపుకుంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, బ్యాంకు ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

పట్టా పాస్‌బుక్‌తో రుణమాఫీ హర్షణీయం

- రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షులు నాగరాజ్ గౌడ్

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పట్టా పాస్‌బుక్ ఆధారంగానే రైతులకు రుణమాఫీ చేస్తామని ప్రకటించడం పట్ల రైతుబంధు సమితి మాజీ మండల అధ్యక్షులు అంకన్నగారి నాగరాజ్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల కుటుంబాన్ని గుర్తించడానికి మాత్రమే రేషన్ కార్డు పరిగణనలోకి తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేయడం యావత్ జిల్లా రైతాంగానికి శుభపరిణామమన్నారు. తొలివిడతగా 18వ తేదీన అర్హులైన రైతులందరికీ లక్ష రూపాయల మేరకు రుణమాఫీ డబ్బులు వారి ఖాతాల్లో జమ అవ్వనున్నాయన్నారు. రుణమాఫీకి రేషన్‌కార్డు నిబంధన పెట్టారన్న అంశంపై ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టలనుకున్నారని కానీ సీఎం రేవంత్‌రెడ్డి పాస్‌బుక్ ఆధారంగానే రైతు కుటుంబానికి రూ.2లక్షల పంట రుణమాఫీ వర్తిస్తుందన్నారు. కుటుంబాన్ని గుర్తించడానికి మాత్రమే రేషన్ కార్డు అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలని నిర్ణయం తీసుకుని ఆదేశాలు ఇవ్వడం పట్ల ప్రతిపక్షాల కుట్రను తిప్పికొట్టి రైతులకు తీపి కబురు అందించారని, ప్రజా ప్రభుత్వం అనడానికి ఇదే నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం 2లక్షల రూపాయల రైతుల రుణమాఫీకి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రైతుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకోబోతుందన్నారన్నారు. ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రి వర్గానికి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీకి రైతాంగం పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

జుక్కల్ : మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద పీర్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామాలలో దూద్ పీర్‌ను తయారు చేసి గ్రామ పుర వీధులలో ఊరేగించారు. గ్రామంలోని ముఖ్యమైన ఖాళీ ప్రదేశంలో ప్రజల దర్శనం కొరకు పెట్టి మజీను నృత్యం చేశారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం



జలాలతో ఆలయానికి వెళ్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జానకంపేట్ గ్రామంలో గ్రామదేవతలకు బుధవారం గంగమ్మ జలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఐదు రోజుల పాటు నిర్వహించే వేడుకల్లో భాగంగా బుధవారం నాలుగు రోజు జలాభిషేకం చేపట్టారు. కార్యక్రమంలో ఉప్పు సురేష్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సుదర్శన్, మాజీ ఎంపిటిసి జక్కం బాల్‌లింగం, గ్రామ పెద్దలు యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జీపి కార్మికుల బకాయిల విడుదలపై హర్షం

- తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్

నవతెలంగాణ-రామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికుల బకాయిలను విడుదల చేయడంపై తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మంగళవారం వర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ప్రకాష్ మాట్లాడుతూ.. కార్మికుల బకాయిలు రూ.150 కోట్లపైన విడుదల చేయడంపై ప్రభుత్వాన్ని అభినందించారు. ప్రజా ఆరోగ్యం కోసం తపించి పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్మికులు సమ్మెచేస్తే ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతును ప్రకటించిందని, దానిని దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు క్రమబద్ధీకరించి, అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జనత, గంగాధర్, సుధాకర్, పోశెట్టి, శివకుమార్, టి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను, పురుగుమందులను అందిస్తున్నాం

- శ్రీ సాయినాథ సీడ్స్ ప్రొప్రైటర్ ఆర్ బాల సతీష్

నవతెలంగాణ-ఆర్మూర్



నిరంతరం రైతుల కోసం మందుల వాడకంపై సలహాలు సూచనలు ఇస్తున్నట్టు వేల్పూర్ మండల కేంద్రంలోని శ్రీ సాయినాథ సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ ప్రొప్రైటర్ ఆర్ బాల సతీష్ నవతెలంగాణకు తెలిపారు. తమ దుకాణానికి వచ్చే పలు గ్రామాల రైతులకు మందుల వాడకంపై సలహాలు సూచనలు ఇస్తున్నామని, పంట పొలాలకు పురుగుల మందు వాడే రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు విత్తనాన్ని ఎంచుకునే ముందు జాగ్రత్త తీసుకోవాలని, వరి పంట వేసిన తర్వాత కూడా ఎప్పటికప్పుడు సూచనలు సలహాలు ఇస్తూ తగు జాగ్రత్తలను వివరిస్తున్నట్టు తెలిపారు.

ఆలయంలో చోరీ..
వ్యక్తికి 8 నెలలు జైలు శిక్ష

నవతెలంగాణ-ఎడపల్లి

ఆలయంలో చోరీ చేసిన వ్యక్తికి 8 నెలలు జైలు శిక్ష విధించారు. మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలో పలు దేవాలయాల్లో దొంగతనానికి పాల్పడిన నిందితుడికి మంగళవారం బోధన్ కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ ఈ.సాయిశివ 8 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదరాల రాణి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలో బిలోలి తాలుక కొండల్ వాడి గ్రామానికి చెందిన జిత్తేవార్ గణేష్ అలియాస్ నర్సింలు(33) అనే వ్యక్తి మంగల్‌పాడ్ గ్రామంలోని బాలత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో, గ్రామ శివారులోనీ చెరువు కట్టపై ఉన్న గంగమ్మతల్లి ఆలయంలో చోరికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన కుంట శ్రీనివాస్ ఏప్రిల్ 14న ఎడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడిన వ్యక్తి ఎడపల్లి బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా పోలీసులు గమనించి నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడిని బోధన్ కోర్టులో హాజరు పర్చగా నేరానికి సంబంధించి సాక్ష్యాధారాలు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదరాలరాణి కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ కేసును వేగవంతం చేసి ఎనిమిది రోజులలో విచారణ పూర్తి చేసి సాక్ష్యాధారాలు రుజువు కావడంతో నిందితుడికి 8 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని అదనపు పిపి. చిదరాల రాణి తెలిపారు. కేసులో లైజన్ ఆఫీసర్ కె.శంకర్, కోర్టు (సిడిపో పిసి.నెంబర్ 165) సాయన్నలు సహకరించారని ఆమె తెలిపారు.

కారుని ఢీ కొట్టిన లారీ..
భయంతో స్టీరింగ్ వదిలి డ్రైవర్ దూకడంతో లారీ బోల్తా

నవతెలంగాణ-భిక్కనూర్

కారును లారీ ఢీకొనడంతో లారీ బోల్తా పడిన ఘటన బుధవారం 44వ జాతీయ రహదారిపై స్థానిక టోల్ ప్లాజా వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుండి కామారెడ్డి వైపు లారీ, కారు వెళుతుండగా ఒక్కసారిగా కారు ఎడమ వైపుకు మల్లడంతో వెనకాల వస్తున్న లారీ కారును ఢీకొట్టింది. భయభ్రాంతులకు గురైన లారీ డ్రైవర్ లారీ నుంచి కిందకు దూకగా లారీ ఎడమవైపుకు వెళ్లి బోల్తా పడింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

ఘనంగా 'పండగ సాయన్న' జయంతి ఉత్సవాలు

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి ఆలయం వద్ద బుధవారం తెలంగాణ రాబిన్ హుడ్ పండగ సాయన్న ముదిరాజ్ జయంతి ఉత్సవాలను తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పండగ సాయన్న చిత్రపటానికి పూల మాలవేసి, ముదిరాజ్ బంధువులు ఆయనను ఆదర్శంగా తీసుకొని సమాజంలో ముందుకు పోవాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, నెల్లిరాజు, సున్నపు వడ్డెన్న, జనార్ధన్, యాసాడ రాజకుమార్, పెసరి ఆంజనేయులు, శ్రీనివాస్, మనోజ్ కుమార్, ఒడ్డెపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ పంపును ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణంలోని 44వ జాతీయ రహదారిపై స్థానిక పోలీస్ స్టేషన్ వెనకాల నూతనంగా నిర్మించిన జీకే పెట్రోల్ పంపును కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వాహనదారులకు నాణ్యమైన పెట్రోల్ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు రమేష్, నాయకులు ఏక్‌నాథ్, రమేష్, యాదగిరి, పెట్రోల్ పంప్ యజమానులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు హంగర్గ రైతువేదికలో వీసీ

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని హంగర్గ క్లస్టర్ రైతువేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయిలో రైతు రుణమాఫీ ప్రారంభోత్సవం వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని ఏవో నవీన్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఏవో నవీన్ కుమార్ పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో సొసైటీ కార్యాలయ ఆవరణలో బుధవారం చైర్మన్ నాగర్తి భూమిరెడ్డి గ్రామానికి చెందిన లింగారెడ్డి, గంగరాజు ప్రమాదవశాత్తు మరణించడంతో విండో సభ్యత్వం ఉన్నందున బీమా కంపెనీ నుంచి మంజూరైన లక్ష రూపాయల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఈత మొక్కలు పంపిణీ



ఈత మొక్కలు పంపిణీ చేస్తున్న అబ్కారీ ఎస్ఐ

నవతెలంగాణ-వర్ని

మండల కేంద్రంలోని గౌడ సంఘ సభ్యులకు బోధన్ అబ్కారి ఎస్ఐ జాలిల్ ఈత మొక్కలను బుధవారం పంపిణీ చేశారు. అటవీ ప్రాంతం సమీపంలో ఒక ఎకరం స్థలంలో గౌడ కులస్తులు మొక్కలను పెంచుకొనేందుకు 200 ఈత మొక్కలను వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పంపిణీ చేశారు. ఐదు మొక్కలను ఆయన నాటారు. ఈ మొక్కలను గౌడ కులస్తులు పెంచుకొని జీవనోపాధిని పెంచుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు జంబి శ్రీనివాస్‌గౌడ్, సాయగౌడ్, రమేష్‌గౌడ్, సాయిబాబా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'ఓ భారతీయుడా' పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

ఓ భారతీయుడా అనే పుస్తకాన్ని బుధవారం స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఆవిష్కరించారు. బీజేపీ సీనియర్ నాయకులు లోక భూపతి రెడ్డి ఆధ్వర్యంలో అంకాపూర్ ఎమ్మెల్యే స్వగృహంలో భారత్ సురక్షా సమితి జిల్లా అధ్యక్షులు పుప్పాల రాజేందర్, కార్యదర్శి, న్యాయవాది శ్రీధర్, రవినాథ్ అందజేశారు. నాటి ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడి, జైలుకు వెళ్లిన విషయాలను చర్చించుకున్నారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ సమయంలో జైలుకు వెళ్లిన పుప్పాల రాజేందర్, శ్రీధర్, రవినాథ్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికారప్రతినిధి కలిగోట గంగాధర్, రూపాలి నర్సయ్యయమాద్రి లింగన్న, సుమన్, సంజీవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాళ్లలో రతనాల సాగు

- భారీగా దిగుబడి

నవతెలంగాణ-జుక్కల్





రాళ్ల భూమిలో సాగుచేసిన పెసర పంట

సాధారణమైన భూముల్లోనే పంట పండించడం కత్తిమీద సాము. అలాంటిది జుక్కల్ మండలంలోని రైతులు గుళిక రాళ్ల భూముల్లో పంటలను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

మండలంలోని పలు గ్రామాలలో రైతులు ఎన్నో కష్టన ష్టాలు భరిస్తూ రాళ్లల్లో పంటలను సాగుచేస్తున్నారు. జుక్కల్ మండలంలో మొత్తం 39 వేల ఎకరాల వరకు పంట సాగుకు అనుకూలమైన భూములున్నాయి. అందులో నల్ల రేగడి, బంక మట్టి, ఎరుపు, రాళ్లరప్పలు కలిగిన రకరకాలైన భూములు విస్తరించి ఉన్నాయి. ముఖ్యంగా గుళిక రాళ్ల రప్పలలో పంటలను రైతులు సాగు చేయడం ఆదర్శనీయం.

మండలంలోని సోపూర్, మధురాతాండా, డోన్గాం తాండా, డోన్గాం, వజ్రఖండి, మైలార్, శక్తీనగర్, విజయ్‌నగర్, దోస్పల్లి, బంగారుపల్లి, గుండూర్, గుండూర్ తాండా, గుల్లా తాండా, పెద్ద గుల్లా, చిన్న గుల్లా, పడంపల్లి, నాగల్‌గావ్ గ్రామాలలో సుమారుగా పది వేల ఎకరాల పైచిలుకు గుళికరాళ్లు కలిగిన వివిధ రకాల భూములు విస్తరించి ఉన్నాయి. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లోనే వర్షాధారంపైన పంటలను రైతులు ఎక్కువగా సాగు చేస్తారు. పర్వత ప్రాంతాలతో పాటు వాటి కింద కూడా ఈభూములున్నాయి. కొన్నింటికి నీటి సౌకర్యం ఉంది. ఇంకొన్ని వాటికి నీటి సౌకర్యం లేదు. వర్షం నీరే పంటకు ఆధారం. రాళ్ల భూములలో ఎక్కువగా సోయా, పెసర, మినుము, కందులు, పత్తితో పాటు కూరగాయలు కూడా పండిస్తుంటారు. కొంత మంది రైతులు పర్వత ప్రాంతాలలో ఉన్న భూములకు పర్వతం కింది భాగంలో బోర్లు వేయించి హై కాంప్రేసర్ మోటర్ ద్వారా ప్రత్యేకంగా పైప్‌లైన్ ఏర్పాటు చేసుకుని నీటి వసతి కల్పించుకుని అద్భుతమైన చెరుకు, అల్లం, ఎల్లిగడ్డ, ఉల్లిగడ్డ పంటలను సాగుచేస్తూ పురోగతి చెందుతున్నారు. వర్షంపైన ఆధార పడిన రైతులు నిత్యం వర్షం పడితే బాగుండేదని అనుకుంటారు. పర్వతంపైన పంటలకు ఎంత వర్షం పడినా నష్టం చాలా తక్కువగా ఉంటుంది. రోజు తప్పించి రోజు వర్షం పడినా ఎటువంటి నష్టం ఉండదు. పంట సాగుకు రైతులు భారీగా పెట్టుబడి ఖర్చు పెట్టాల్సిందే. విత్తనాలు, మందులు, కలుపు కోసం కూలీల ఖర్చులు ఎక్కువగానే ఉంటాయి.

గుళిక రాళ్లు ఉండటం వలన కట్టెతో తయారు చేసిన వ్యవసాయ పనిముట్లు ఎక్కువగా రాళ్లు ఉండటంతో విరిగిపోతాయి, నాటి పూర్వీకుల కాలంలో కట్టే సమాన్లు మాత్రమే కల్గిఉండేవి. వాటిని సున్నితంగా వాడేవారు. ఏ కొంచెం పొరపాటు జరిగిన విరిగి పోయేవి. ప్రస్తుతం ట్రాక్టర్, హర్వేస్టింగ్ యంత్రాలు అందుబాటులోకి రావడంతో వాటిని ఉపయోగిస్తున్నారు.

పత్తి లేదా సోయా సాగుచేస్తా



నాకు ఎకరం గుళిక రాళ్ల భూమి ఉంది. అందులో ఎక్కువగా పత్తి లేదా సోయా పంటను ప్రతీ ఏడాది వర్షంపైనే ఆధారపడి సాగు చేస్తుంటాను. పంటకు సరిపడా వర్షం పడితే పంట దిగుబడి ఎకరాకు ఎనిమిది నుండి పది క్వింటాల్లు వస్తుంది. ఖర్చులు పోను సగం మిగులుతుంది.

- రైతు సాయిలు, డోన్గాం.

ఏడాదికి మూడు పంటలు



నాకు పది ఎకరాల గుళిక రాళ్ల భూమి ఉంది. పర్వతం కింద కొంత భూమి ఉంది. అక్కడ బోరు బావి ఉంది. అక్కడి నుండి నీటిని గట్టు మీదికి పైప్‌లైన్ ద్వారా నీరు పంపింగ్ చేసి వివిధ రకాల పంట సాగు చేస్తాను. వర్షాలు సమ యానికి పడకపోతే బోరు నీరు సహాయంతో నీటిని వాడుకోవడం వలన సంవత్సరానికి మూడు పంటలు పండించి నంచి లాభాలు వస్తుంటాయి.

- రైతు శివాజీ, డోన్గాం తాండా.

పత్తి సాగుకు ప్రత్యేకం

- మద్నూర్ మార్కెట్‌లో పత్తి విక్రయించేందుకు ఇతర రాష్ట్రాల రైతులు రాక

నవతెలంగాణ-మద్నూర్



మద్నూర్ మండలంలో సాగుచేసిన పత్తిపంట

మద్నూర్ మండలంలో వ్యవసాయ రైతులు పత్తి పంట అధికంగా సాగు చేస్తారు. ఎందుకంటే పత్తి పంట కొనుగోళ్లకు మద్నూర్ మార్కెట్ కమిటీ అనుకూలం. ఈ మార్కెట్ కమిటీ పరిధిలో పత్తి పరిశ్రమలు అత్యధికంగా ఉన్నాయి.

మద్నూర్ మండలంలో పత్తి పరిశ్రమలు దాదాపు 50 సంవత్సరాల కాలంగా కొనసాగుతూ వస్తున్నాయి. పత్తి పరిశ్రమల మూలంగా పత్తి పంట సాగుకు ఇక్కడి వ్యవసాయదారులు మొగ్గుచూపుతారు. ఈ మండలంలో వ్యవసాయదారులకు ఎలాంటి సాగునీటి సౌకర్యం లేనప్పటికీ వర్షాధారంపైనే ఆధారపడి పత్తి పంట సాగుపై అధికంగా మొగ్గుచూపుతున్నారు. మద్నూర్ మార్కెట్ పత్తి కొనుగోళ్లకు ప్రఖ్యాతి గాంచింది. ఈ మార్కెట్ పరిధిలో అత్యధికంగా ప్రైవేటు పత్తి మిల్లులున్నాయి. వ్యాపారులు పత్తి పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తారు. ఒక్కొక్క రోజు వేలక్వింటాళ్ల పత్తిని అమ్మడానికి మద్నూర్ మార్కెట్‌కు తరలివస్తుంది. ఈ మండల ప్రాంత రైతులే కాకుండా నియోజకవర్గం రైతులు సొంత జిల్లా రైతులే కాకుండా తెలంగాణ ప్రాంత ఇతర జిల్లాల నుంచి పత్తి పంటను ఇక్కడ అమ్ముకోవడానికి మద్నూర్ మార్కెట్‌కు తరలివస్తారు.

ప్రస్తుతం ఈ ఏడాది మద్నూర్ మండలంలో వ్యవసాయ అధికారుల అంచనాల ప్రకారం 5వేల ఎకరాల వరకు పత్తి పంట సాగు చేస్తున్నట్టు తెలుస్తోంది. మద్నూర్ మార్కెట్ పరిధిలో పత్తి పరిశ్రమలు ఉన్నందున పత్తి పంట సాగు రైతులకు ఈ పరిశ్రమలు ఎంతో అనుకూలంగా ఉన్నాయి. ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర కంటే ప్రైవేట్ ధర అధికంగా ఉంటుంది. ఈ మద్నూర్ మార్కెట్ కమిటీ పరిధిలో పత్తి కొనుగోలు అధికంగా జరగడానికి ఇటు తెలంగాణ రాష్ట్ర రైతులు అటు సరిహద్దు ప్రాంత మహారాష్ట్ర, కర్ణాటక పత్తి రైతులు పండించిన పత్తి పంటను మద్నూర్ మార్కెట్‌కు తరలించి అమ్మకాలు చేపడుతుంటారు. పత్తి కొనుగోళ్ల ద్వారా మద్నూర్ మార్కెట్ కమిటీకి ప్రతి సంవత్సరం కోట్లల్లో ఆదాయం వస్తుంది. పత్తి పంట సాగుకు పెట్టుబడులు అధికంగా పెట్టవలసి వస్తుందని పత్తి పంట సాగు రైతులు చెబుతున్నారు.

విద్యుత్ జూనియర్ లైన్‌మెన్‌పై దాడి

- ఖండించిన ఉద్యోగులు

నవతెలంగాణ-వేల్పూర్(ఆర్మూర్)

మండలంలోని పోచంపల్లి గ్రామ జూనియర్ లైన్మెన్ ఈనెల 15 వ తేదీనా గ్రామంలో డీ లిస్టు ఆపరేట్ చేస్తున్న సమయంలో ఒక సంఘ భవనానికి డైరెక్ట్‌గా సర్వీస్ వైరు పెట్టుకొని విద్యుత్ వాడుతుంటే ఆ సర్వీస్‌ను తొలగిస్తుండగా ఆ గ్రామ మాజీ ఉపసర్పంచ్ చింతలపల్లి గంగారెడ్డి అనే వ్యక్తి అకారణంగా కోపంతో మా సంఘానికి ఉన్న సర్వీస్ను ఎలా తొలగిస్తావని నీ సంగతి చూస్తా అని నానా బూతు మాటలు తిడుతూ జూనియర్ లైన్మెన్ కాలర్ పట్టుకుని నెట్టి వేస్తూ దాడి చేసినట్టు విద్యుత్ ఉద్యోగులు బుధవారం తెలిపారు. దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కె నరేందర్ నాయక్ అధ్యక్షులు ఎం సంజువ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వేల్పూర్ ఎస్సైతో మాట్లాడి వెంటనే కేసు రిజిస్టర్ చేయాలని కోరారు. ఈ వ్యక్తి పైన చట్టారిత్య చర్య తీసుకోవాలని 1104 సంఘం తరపున కోరారు. ఈ వ్యక్తికి నాలుగు సర్వీసులు పైన సుమారు 35 వేల రూపాయలు బకాయిలు ఉన్నందున ఇతని సర్వీస్లు తొలగించారని మనసులో పెట్టుకొని పాతకక్షలు పెట్టుకుని విద్యుత్తు సిబ్బందిపై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ సెక్షన్ లీడర్ కే రాజు లైన్ ఇన్స్పెక్టర్ నర్సయ్య లైన్మెన్లు నరేష్ సాయిలు జోసఫ్ పాల్గొన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి

నవతెలంగాణ-సదాశివనగర్/నాగిరెడ్డిపేట్

మండలంలోని అన్ని గ్రామాల్లో తొలి ఏకాదశి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ పండుగ సందర్భంగా ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాగిరెడ్డిపేట్ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో తొలి ఏకాదశి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నూతన హెూటల్ ప్రారంభించిన వినయ్ రెడ్డి

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని తెలంగాణ హెూటల్ ను ఆర్మూర్ కాంగ్రెస్ నియోజక వర్గ ఇంఛార్జి పి. వినయ్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్త మైనార్టీ నాయకులు అరిఫ్ నూతన్ హెూటల్ పెట్టుకొని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యకర్తలు అందరూ కూడా స్వయం ఉపాధి కల్గి ఉండాలని తెలిపారు. అరిఫ్ ని ఆశీర్వదించి హెూటల్ దినదినా అభివృద్ధి పొందాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రవి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అదక్షులు వెంకటేశ్వర్ రావు, జిల్లా పంచాయతీ సంఘటన అదక్షులు గంగాధర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి డేగ పోషెట్టి, సింగిల్ విండో చైర్మన్ బుర్రోల్ల అశోక్, మాజీ సర్పంచ్ రాజేందర్, అలిం, గోరె మియ, జైల్ సింగ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సలహా మేరకే తెగుళ్లకు మందులు వాడాలి

- ఎల్లారెడ్డి మండల వ్యవసాయ అధికారి హరీష్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



పంటలకు తెగులు వచ్చినప్పుడు రైతులు ఎవరు వారికి తోచిన మందులను వాడకూడదని పంటకు సోకిన తెగుళ్ళ నమూనాను తీసుకొని వ్యవసా యశాఖ కార్యాలయానికి వస్తే క్షుణ్ణంగా పరీక్షించి వాటి నివారణకు కావలసిన మందులను రాసి ఇస్తామని ఎల్లారెడ్డి మండల వ్యవసాయ అధికారి హరీష్ అన్నారు. బుధవారం ఆయన నవతె లంగాణతో మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి మండల వ్యాప్తంగా ఈ వానాకాలంలో 15,528 ఎకరాలలో పంట సాగు చేయాలని లక్ష్యంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగా 15,351 ఎకరాలలో వరి సాగు, 34 ఎకరాలలో చెరుకు సాగు, 127 ఎకరాలలో పత్తి, సోయా, మినుము ఇతర పంటలు సాగు అవుతున్నట్లు తెలిపారు. 2024 వానా కాలంలో 60 శాతం సబ్సిడీపై పచ్చి రొట్టె విత్తనాలను రైతులకు పంపిణీ చేశామని, పంటలకు కావల సిన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, సొసైటీ కేంద్రాల ద్వారా రైతులకు ఆధార్ కార్డు, పట్టా పాస్ బుక్ ఆధారంగా వరి పంటకు 2/3 బస్తాలు, ఇతర పంటలకు తగినన్ని అవసరాన్ని బట్టి రైతులకు ఇబ్బంది కలగకుండా సరఫరా చేస్తున్నామని అన్నారు. పంట సాగు చేసిన మొదలు వివిధ దశలలో తీసుకోవలసిన జాగ్రత్తలను వ్యవసాయ కార్యాలయ సిబ్బంది క్లస్టర్ల వారిగా క్లస్టర్ పరిధిలోని రైతులతో ఒకచోట సమా వేశం ఏర్పాటు చేసి అవగాహన కలిగిస్తూ రైతుల సందేహాలను నివృత్తి చేస్తున్నామని పేర్కొన్నారు. పంటలకు తెగులు వచ్చినప్పుడు రైతులు వారికి తోచిన మందులను వాడుకూడదని వాటి నమూనాలను పరీక్షించిన తర్వాత అధికారులు సూచించిన మేరకు తగిన మోతాదులో క్రిమిసంహారక మందు లను పిచికారి చేయాలని సూచించారు. ఎరువులను క్రిమిసంహారక మందులను లైసెన్సు అనుమతి పొందిన దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలని, వాటికి సంబంధించిన రసీదులను తీసుకొని పంటకాలం పూర్తయ్యేదాకా రసీదులను భద్రపరుచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బీసీ కమిషన్ రిపోర్ట్‌ను సుప్రీంకోర్టుకు పంపాలి

నవతెలంగాణ-భిక్కనూర్

బీసీ కమిషన్ రిపోర్ట్‌ను సుప్రీంకోర్టుకు వెంటనే పంపాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు బిక్షపతి తెలిపారు. బుధవారం భిక్కనూర్ పట్టణంలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ముదిరాజ్ సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్రంలో 60 లక్షల జనాభా ఉన్న ముదిరాజులకు చట్టసభలలో ప్రాతినిథ్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్, మండల సంఘం నాయకులు రాములు, సత్యనారాయణ, లక్ష్మీ నరసింహులు, శ్రీనివాస్, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్‌లో విజయ్ విద్యార్థులు



నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని విజయ్ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. తెలంగాణ ఫుట్బాల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో 10వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్బాల్ ఛాంపియన్ షిప్-2024-25 పోటీలు ఈ నెల 12 నుండి 14 వరకు మినీ స్టేడియం, కల్వకుర్తిలో మూడు రోజులపాటు జరిగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనగా తొమ్మిదవ తరగతి చదివే జె. మధుశ్రీ, సి.హెచ్. జాహ్నవి యాదవ్ ఎనిమిదవ తరగతి చదివే సి.హెచ్. హరిణి పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచారు. విద్యార్థులను విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకురాలు డాక్టర్ అమృతలత బుధవారం పాఠశాలలో అభినందించారు.

బార్‌కోడ్‌తో సీడ్స్, ఫర్టిలైజర్స్ నాణ్యత

- సాంకేతిక పరిజ్ఞానంతో సాగుతున్న రైతులు



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రతి రైతు ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ వాడుతున్నారు. ఆ ఫోన్లో ప్రతి ఒక్కరు చాలా అంశాలను తెలుసుకుంటున్నారు. అదేవిధంగా ప్రతి ఫర్టిలైజర్ సంచి పైన బార్కోడ్ పొందుపరచడం జరుగుతుంది. ఆ బార్కోడ్ని స్కాన్ చేసి ఆ ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు సరియైనవో... కాదో..., సక్రమమైవో... కాదో... విత్తనాలు, ఎరువులు ఒరిజినల్ వేనా... వాటి నాణ్యత లోపాలు ఏమన్నా ఉన్నాయా... అనే అంశాలను తెలుసుకునే అవకాశాలు ఉంటాయని నిజామాబాద్ అర్బన్ మండల వ్యవసాయ అధికారి డి. సౌమ్య తెలిపారు. నవతెలంగాణ తెలుగు దినపత్రిక ఏరువాక ప్రత్యేక సంచిక సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయం ప్రస్తుత పరిస్థితుల్లో అడ్వాన్స్ టెక్నాలజీ పరుగులు తీస్తుందని, రైతులు ఈ అడ్వాన్స్ టెక్నాలజీని ఉపయోగించుకుని ఇంకా ముందుకు కొనసాగుతున్నారని అన్నారు. దాంతోపాటు వ్యవసాయ అధికారులను కూడా సంప్రదిస్తూ సలహాలు సూచనలు తీసుకుంటూ ఇంకా ముందుకు సాగుతున్నారని అన్నారు. పంటకు ఎటువంటి తెగుళ్ల వచ్చిన పంట పొలానికి ఎటువంటి తెగుళ్ల వచ్చిన వాటిని ఏ విధంగా పరిష్కరించుకోవాలి. ఏ విధంగా ముందుకు సాగాలి అనే విధంగా రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదిస్తూ ముందుకు సాగుతారని తెలిపారు. రైతులు నూతనంగా ఏర్పడిన పరికరాలతో వ్యవసాయ పనిముట్లతో వ్యవసాయం కొనసాగిస్తున్నారని అన్నారు. మరింత సాంకేతికతతో పరుగులు తీస్తున్నారని, ఎంతో ఉత్సాహంగా నూతన వంగడాలతో మరింత పంట దిగుబడి వచ్చేందుకు వినూత్న సాంకేతికత ఉపయోగిస్తూ రైతులు ముందుకు సాగుతున్నారని అన్నారు. అంతేకాకుండా రైతు సోదరులకు ప్రభుత్వం వీడియో కాన్ఫరెన్స్ సమావేశాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఎటువంటి నాణ్యమైన విత్తనాలను ఉపయోగించాలని, రైతులతో అధికారులు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు మరింత పాల్గొని సలహాలు, సూచనలు తీసుకుంటూ వ్యవసాయ పంట సాగుపై ముందుకు కొనసాగాలని అన్నారు.

సేంద్రియ పద్ధతిలోనే పంటలను పండించాలి

- ఫర్టిలైజర్ యజమాని రఘు



నవతెలంగాణ-డిచ్‌పల్లి

సేంద్రియ పద్ధతిలోనే పంటలను పండించాలని ఫర్టిలైజర్ యజమాని రఘు రైతులకు సూచించారు. బుధవారం నవతెలంగాణతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. రైతులు పొలాల్లో కంపోస్టు వాడాలని, పంటల్లో నత్రజని తక్కువగా వాడాలని తెలిపారు. పంట చేతికొచ్చే సమయంలో రైతులు ఎటువంటి స్ప్రే వాడవద్దని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసేముందు సీల్ వేసి ఉన్న వాటినే కొనుగోలు చేయాలని తెలిపారు. వాటి రసీదును భద్రపర్చుకోవాలని పేర్కొన్నారు. పంటకు అధికంగా మందులు వాడటం వల్ల అన్ని రకాల హానికరం జరుగుతుందని తెలిపారు.

ఎర్ర జొన్నలతో హరిత విప్లవం

- సొంత ప్లాంటింగ్ ద్వారా విత్తనాలు సరఫరా
- త్రివేణి అగ్రిటెక్ యజమాని సల్ల నర్సారెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

దేశంలోనే వ్యవసాయ రంగంలో పేరుందిన జిల్లాలోని అంకాపూర్ గ్రామ రైతులు ఎందరికో ఆదర్శంగా నిలిచారు. ఇక్కడ వరి, పసుపువంటి పంటలతోపాటు ఎర్రజొన్నలను పండిస్తారు. సొంత ప్లాంటింగ్‌ద్వారా ఎర్రజొన్నల విత్తనాలు సరఫరా చేస్తున్నట్టు త్రివేణి అగ్రిటెక్ యజమాని సల్ల నర్సారెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ.. వ్యవసాయం తప్ప మరో వ్యాపకం తెలియని వారు ప్రతిసారి కష్టాన్ని నమ్ముకున్న వారు తాను పస్తులుండి ప్రపంచానికి అన్నం పెట్టేవారు ఈ ప్రపంచంలో ఒక్క రైతు మాత్రమే అని అన్నారు. సాగు బాగుపడాలంటే కాలానుగుణంగా రైతు దృక్పథంలోనూ మార్పు రావాలని, పాత విధానాలకు స్వస్తి పలికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకోవాలని తెలిపారు. రైతన్నలు బాగుండాలని, వర్షాలు బాగాపడి పంటలు బాగా పండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ప్రతి సంవత్సరం ముందస్తు ఎర్ర జొన్న పంట ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

శ్రమ జీవనానికి ప్రత్యేకం మా మహిళా రైతులు..

శ్రమ జీవనానికి ప్రతీక మా అంకాపూర్ రైతులు అని వ్యవసాయానికి ఆయువు పట్టు అని, పోటీ తత్వంతో అభివృద్ధి చెందామని తెలిపారు. అధిక దిగుబడులు సాధించడంలో ఈ గ్రామ రైతులు అవలంబిస్తున్న సాగు పద్ధతులు బాగున్నాయంటూ ఆసియా, ఆఫ్రికా ఖండాలకు చెందిన 17 దేశాల వ్యవసాయ శాస్త్రవేత్తల బృంద సభ్యులు 2015 జనవరి 12న అంకాపూర్ గ్రామాన్ని సందర్శించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో సౌత్ సుడాన్, క్యూబా, టంజానియా, ఐవరికోస్టు, కుడుంగా, కిరికిస్తాన్, ఇరిట్రియా, సిరియా, బోర్స్ వాన, సెర్బియా, అల్జీరియా, కెన్యా, శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్, మారిషస్, మంగోలియా దేశాలకు చెందిన 25 మంది వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇక్కడకు వచ్చి వ్యవసాయ సాగు విధానాలను అధ్యయనం చేశారు. రైతులు అభివృద్ధి సాధించిన తీరు అద్భుతంగా అభివర్ణించారు.

భవితకు వరం.. సేంద్రీయం..

ప్రస్తుతం ఆర్థికంగా అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాల ఆహారం అభిరుచుల్లో మార్పు వచ్చిందని, పర్యావరణ పరిరక్షణ ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో శ్రేష్ఠమైన ఆహారం ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని త్రివేణి అగ్రిటెక్ యజమాని సల్ల నర్సారెడ్డి నవ తెలంగాణతో తెలిపారు. రైతన్నలకు ఏరువాక శుభాకాంక్షలు తెలుపుతూ భవిష్యత్తు తరాలకు పెనుముప్పుగా మారిన మహమ్మారి సేద్యం నుంచి విముక్తి పొందడానికి మళ్లీ మానవాళి సేంద్రియ ఉత్పత్తుల వైపు ఆకర్షితులు అవుతుందని అన్నారు.

పెర్కిట్‌లో..

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌కు చెందిన రైతు పెద్దకాపు మోహన్ ఒక ఎకరంలో అధిక దిగుబడిని ఇచ్చేందుకు ట్రయల్‌గా జొన్న సీడ్ వేశారు. జొన్న విత్తనాల కంకులు ఏకంగా ఒక్క ఫీట్‌తో ఎదగడం విశేషం.



పెర్కిట్లో ఏపుగా పెరిగిన జొన్న సీడును పరిశీలిస్తున్న త్రివేణి అగ్రిటెక్ యజమాని సల్ల నర్సారెడ్డి

అధిక దిగుబడులు సాధించాలన్న ఆలోచనలతో..

అధిక దిగుబడులు సాధించాలన్న ఆలోచనలతో సీడు కంపెనీ ఏర్పాటు చేసినట్టు నర్సారెడ్డి తెలిపారు.. వరి సీడును సీజన్లో తయారు చేస్తూ మార్కెట్లో అమ్మడం జరుగుతుందని సొంత ప్లాంటింగ్ ద్వారా ఎర్రజొన్నల విత్తనాలు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. 10 నుండి 25, 30 గ్రామాలకు స్వయంగా వారి ఎర్ర జొన్నలే వాడుతూ అధిక దిగుబడులను సాధిస్తున్నారు రైతులు. వాతావరణ పరిస్థితులను బట్టి పంటలను వేస్తున్నారని అన్నారు. డివిజన్లోని పలు గ్రామాలకు ఎర్ర జొన్న విత్తనాలను ఇస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నట్టు తెలిపారు. పెర్కిట్‌లో 10 సంవత్సరాల నుండి, మిర్దాపల్లిలో 11, 12 సంవత్సరాల నుండి, వేల్పూరులో 10 సంవత్సరాల నుండి సీడు ఇస్తున్నట్టు తెలిపారు. 20 20, 22 సంవత్సరం వేల్పూర్‌కు చెందిన రైతు అశోక్ 28 క్వింటాళ్ల దిగుబడి సాధించినట్టు తెలిపారు.

నేడు రైతు వేదికలో రుణమాఫీ సంబరాలు

నవతెలంగాణ-బాల్కొండ

నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రుణమాఫీ లాంఛనంగా ప్రారంభిస్తున్న సందర్భంగా బాల్కొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో రుణమాఫీ సంబరాలు నిర్వహిస్తున్న మండల వ్యవసాయ అధికారి మహేందర్ రెడ్డి బుధవారం తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని, లబ్ధిదారులతో ముఖ్యమంత్రి ముఖాముఖి మాట్లాడుతారని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు ఈ కార్యక్రమాన్ని వీక్షించవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా రైతు వేదికలోనే రుణ మాఫీ లబ్ధిదారులతో సంబరాలు జరుపుతున్నామని పేర్కొన్నారు. సంబరాల్లో రైతులు తప్పనిసరిగా అధిక సంఖ్యలో పాల్గొనాలని ఏవో కోరారు.

22న జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

నవతెలంగాణ-బోధన్

నిజామాబాద్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఆన్‌లైన్ ద్వారా క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్టు, విద్యార్థులు ఈ క్విజ్ పోటీలలో పాల్గొనాలని ఒలంపిక్ సంఘం ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1900 నుంచి ఒలింపిక్ గేమ్స్‌లో భారతదేశం సాధించిన విజయాలను సాగిన పయనాన్ని పురస్కరించుకుని, ఆన్‌లైన్ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మన దేశ కీర్తిని పెంచిన ఒలింపిక్ వీరులను స్మరించడానికి ఇదొక అద్భుత అవకాశమని పేర్కొన్నారు. 22న మధ్యాహ్నం 1:30 నుంచి 2:00 వరకు పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని సూచించారు. ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు పాల్గొనాలని సూచించారు. హ్ట్‌ట్‌ప్స్://నబఙఓ.అఓఎశ్రీఎఎజూఙఝం-ంఆ.షీఎ ఈ వెబ్ సైట్‌లో చేరి పోటీలలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు 73965 41233 నెంబరును సంప్రదించాలని సూచించారు.

మైలురాయి.. గందరగోళం



నవతెలంగాణ-పోతంగల్

మైలురాయి దూరాన్నే కాక గమ్యాన్ని సూచిస్తుంది. కానీ పోతంగల్ మండల కేంద్రంలో గమ్యం చేరినప్పటికీ దూరం మాత్రం ఇంకా 3 కిలోమీటర్లు ఉన్నట్లు దర్శనమిస్తుంది. దీనివల్ల చాలామంది రహదారి గుండా వెళ్ళేవారు గందరగోళానికి గురవుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి దీనిని సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

చాప్ కట్టర్.. రైతులకు బెటర్

- మక్క, చెరుకు సొప్పవంటి దాణా కట్టింగ్‌కు ఉపయోగకరం



నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

చాప్ కట్టర్ ఇది వ్యవసాయం చేసే రైతులకు, పాడే గేదెలను పెంచే రైతులకు చాలా ఉపయోగపడుతుందని ధన్రాజ్ ఆగ్రో ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ దండు గోవర్ధన్ అన్నారు. నవ తెలంగాణ తెలుగు దినపత్రిక ఏరువాక ప్రత్యేక సంచిక సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాప్ కట్టర్ ధర చాలా తక్కువ గానే ఉంటుంది కానీ దాని పనితనం చాలా ఎక్కువగా ఉంటుందని, దాంతో మక్క, చెరుకు సొప్ప వంటివి కట్ చేసి గేదెలకు, పశువులకు ఆహారంగా వేయడం ఇబ్బందికరంగా ఉండ కుండా సులభతరంగా ఉంటుందని అన్నారు. పాలిచ్చే పశువులు ఎక్కువగా ప్రీతీకరంగా మక్కసొప్ప, చెరుకు ఆకులను తింటాయని దాంతో పాలిచ్చే గేద మరింత వెన్న శాతం ఎక్కువగా వచ్చే విధంగా ఉపయోగపడుతుం దని వివరించారు. 27,500 రూపాయలకే లభిస్తుందని, దానికి వన్ హెచ్పి మోటర్ సరిపోతుందని తెలిపారు. ఈ చాప్ కట్టర్ ఒక గంటకి రెండు క్వింటాళ్ల చొప్పున మక్క, చెరుకు సొప్ప కట్ చేసే కెపాసిటీ ఉంటుందని, దానిని ఆర అంగుళం, అంగుళం ముక్కగా కట్ చేసు కుని వెసులుబాటును కూడా దీంట్లో అడ్జస్ట్ చేసుకోవచ్చని అన్నారు. ఈ చాప్ కట్టర్ మిషన్ లో బ్లేడ్లు రెండు వైపులా పదునుగా ఉంటా యని, వాటితో ఒకవైపు బ్లేడ్ల పదును తగ్గితే మరోవైపు బ్లేడ్లు మార్చుకునే అవకాశం ఉం టుందని అన్నారు. రెండు రోలర్లుగా పని చేస్తుందని, చాప్ కట్టర్ మెషిన్‌లో బేరింగ్ సిస్టంతో ఎక్కువ కాలం మన్నిక వస్తుందని తెలిపారు. ఈ మిషన్‌తో పది నుంచి 20 బర్రెల వరకు సరిపోయే చెరుకు సొప్ప, మక్క సొప్ప కట్ చేసే అంత కెపాసిటీ ఉంటుందని అన్నారు. ఈ మిషనరీ ఆన్ చేసిన తర్వాత రన్నింగ్ సమయంలో గేర్లు మార్చవద్దని, నెమ్మదిగా మార్చుకొని అవకాశంతో మరింతకాలం మన్నె అవకాశం ఉంటుందని, గేర్లు తొందరగా పాడవకుండా ఉంటాయని వివరించారు.

పసుపు, సోయాబీన్ రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

- శ్రీ ఆదిత్య అగ్రో ఏజెన్సీ ప్రొప్రైటర్ చేపూరి శ్రీధర్



నవతెలంగాణ-ఆర్మూర్

పసుపు, సోయాబీన్ వేసిన రైతులు సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సీడ్స్ అండ్ ఫెస్టిసైడ్స్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, పట్టణంలోని శ్రీ ఆదిత్య అగ్రో ఏజెన్సీ ప్రొప్రైటర్ చేపూరి శ్రీధర్ నవతెలంగాణకు తెలిపారు. ఈ సంవత్సరం పసుపు సాగు విస్తీర్ణము అనూహ్యంగా పెరిగింది. సంవత్సరం పసుపునకు మంచి ధర పలికినందున ఈసారి రైతులు పసుపు పంటను అధిక మొత్తంలో సాగు చేయడానికి నిర్ణయించుకుని సాగు చేశారని అన్నారు. ముఖ్యంగా పసుపు పంటలో దుంప కుళ్లు, దుంప ఈగ, మర్రి ఆకు తెగులు రైతు లకు ముఖ్య సమస్యలని అన్నారు. రైతులు అధిక వర్షాలు కురిసినట్లైతే నీటిని మాత్రం వెంటవెంటనే తీసివేస్తూ, మురుగునీరు నిలువ ఉండకుండా చూసుకోవాలి . దుంప ఈగ ప్రధాన సమస్య పసుపు పంటలో ఈ దుంప ఈగ నివారణకు ప్రతి రైతు విప్రోనిల్ గుళికలను తప్పకుండా ఎకరానికి ఎనిమిది కిలోలు చల్లుకోవాలని సూచించారు. అలాగే దుంప కుళ్ళు అనేది ప్రధాన సమస్య దీనిక రోగం వచ్చిన తర్వాత కంట్రోల్ చేయడం అనేది చాలా కష్టం కాబట్టి ముందస్తు జాగ్రత్తగా దీని నివారణకు తెగుళ్ల మందులను ట్రేన్సింగ్ ద్వారా గాని లేకుంటే స్ప్రే ద్వారా గాని ముఖ్యంగా మెటల్ ల్యాక్సిల్ అనే మందును రైతులు వాడుతూ ఉండాలని అన్నారు. ఇంకో ప్రధాన సమస్య మర్రి ఆకు తెగులు దీని నివారణకు రకరకాల తెగుళ్ళ మందులు ఇప్పుడు మార్కెట్లో ఉన్నాయి. రైతులు మార్చి మార్చి రెండుసార్లు స్ప్రే చేసుకోవాలని సూచించారు.

సోయాబీన్ పంటలపై...

సోయాబీన్ సాగు చేస్తున్న రైతులు 30 రోజులు దాటిన పైరులో కాండపు ఈగ ఆశించడం జరిగిందని తెలిపారు. ఇది కాండంపైన రంధ్రాలను చేస్తూ మొక్కలోనికి చొచ్చుకొనిపోయి కాండాన్ని మొత్తం తిని వేయడం వల్ల మొక్క మొత్తం చనిపోవడం జరుగుతుందని తెలిపారు. దీనిని కూడా రైతులు సకాలంలో గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని, లేకుంటే నష్టం తీవ్రంగా ఉంటుందని అన్నారు. ఈ కాండ ఈగ గుర్తించడానికి కాండము దగ్గర చూసినట్లయితే ఒక రంధ్రం ఏర్పడి ఉంటుందని, కాండపు ఈగ రంధ్రం చేస్తూ కాండం లోనికి చేర్చుకొని పోయి దాన్ని పూర్తిగా తినేస్తుందని అన్నారు. పంట నష్టం తీవ్రంగా ఉండడం జరుగుతుందని, ఇది రైతులు గమనించి వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులను కోరారు.

18న ఆశాలతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి

- సిఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సురేష్ గొండ



నవతెలంగాణ-జుక్కల్

ఆశ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జూలై 18న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు సురేష్ గొండ పిలుపునిచ్చారు. బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆశాల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని సురేష్ గొండ తెలిపారు. అదే క్రమంలో ఆశాల సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లేలా ఈ నెల 18న జుక్కల్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు చేపట్టే క్యాంపు కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి జుక్కల్ నియోజకవర్గంలోని 8మండలాల్లో విధులు నిర్వహిస్తున్న ఆశాలు పెద్దఎత్తున పాల్గొని ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మొక్కజొన్నపొత్తులు @ అంకాపూర్

- వందలాది మందికి ఉపాధి
- ఇతర రాష్ట్రాలకు ఎగుమతి
- మక్కవడలకు ప్రత్యేకత

నవతెలంగాణ-ఆర్మూర్

శ్రమ జీవనానికి ప్రతీకగా దేశంలోనే పేరు తెచ్చుకున్న అంకాపూర్ గ్రామ రైతుల కృషి అభినందనీయమని రాజకీయ నాయకులు, అధికారులు, శాస్త్రవేత్తలు కొనియాడారు. ఈగ్రామంలో మొక్కజొన్నపొత్తులు విక్రయిస్తుంటారు. ప్రతిఏటా ఇక్కడినుండి ఎక్కువగా ఎగుమతి అవుతుంటాయి.

జాతీయ రహదారి పక్కనే..

పట్టణం నుండి నిజామాబాద్ వెళ్లే 63వ నంబరు జాతీయ రహదారి పక్కనే పచ్చి బుట్టల మార్కెట్ ఉంది. కాగా పచ్చిబుట్టలకు ప్రత్యేకంగా ఎక్కడా మార్కెట్ లేదు. కానీ ఇక్కడ ప్రతి సంవత్సరం జూలై నుంచి అక్టోబర్ వరకు రైతులు నిత్యం పచ్చి బుట్టలు విక్రయిస్తారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పాటు మహారాష్ట్ర లోని పలు ప్రాంతాలకు ఇక్కడి నుంచి పచ్చిబుట్టలు ఎగుమతి అవుతుంటాయి. ప్రతి ఏటా కోట్లల్లో వ్యాపారం జరుగుగుంది.

వందలాది మందికి ఉపాధి...

30 సంవత్సరాలుగా పచ్చిబుట్టల మార్కెట్ కొనసాగుతుంది. ఈ ప్రాంత రైతులు పంట మార్పిడి విధానం పాటించి ఏడాదిలో మూడు పంటలు పండిస్తున్నారు. ఏప్రిల్ మొదటి వారంలో సాగు మొదలుపెట్టగా జూలైలో పచ్చిబుట్టలు మార్కెట్లోకి వస్తాయి. ఇక్కడి పచ్చిబుట్టలు హైదరాబాద్, ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్‌లతో పాటు ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాలు, మహారాష్ట్ర లోని నాందేడ్, నాగపూర్, ఔరంగాబాద్ పట్టణాలకు ఎగుమతులు అవుతాయి. జిల్లాలోని బాల్కొండ ,మోర్తాడ్, జక్రాన్ పల్లి ,వేల్పూర్ ,నందిపేట్, ఆలూరు, మండలాలలోని రైతులు పండించిన పచ్చి బుట్టలను ఇక్కడకు తీసుకొచ్చి విక్రయి స్తారు. మార్కెట్ నాలుగు నెలలపాటు కొనసా గుతుండగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు రైతుల దగ్గర పెద్ద మొత్తంలో కొనుగోలు చేసుకుని లారీలు, వ్యాన్లలో తరలిస్తారు. చిరు వ్యాపారులు తక్కువ మొత్తంలో కొనుగోలు చేసి ఇక్కడే రోడ్డు పక్కన కుప్పలుగా పోసి విక్రయిస్తారు. వందలాది మంది ప్రత్యక్షంగా, పరీక్షంగాను పచ్చి బుట్టల అమ్మకంతో ఉపాధి పొందుతున్నారు.

సొంత ఖర్చులతో పంట క్షేత్రాల నుంచే..

డిమాండ్ ఆధారంగా ఒక పచ్చి బుట్టల ట్రాలీ అరు వేల నుండి 8 వేల ధర పలుకుతుంది. ఎకరానికి 10 నుంచి 12 ట్రాలీలు సుమారుగా ఐదు ఆరు టన్నులు దిగుబడి వస్తుంది.. రైతులకు పెట్టుబడి పోను 50వేలకి పైగా ఆదాయం సమకూరుతుంది. ముందస్తుగా ఒప్పందం చేసుకొని డబ్బు చెల్లించి సొంత ఖర్చులతో పంట క్షేత్రాల నుంచే దూర ప్రాంతాలకు సైతం తీసుకెళ్తున్నారు. 100 రూపాయలకు 15 వరకు, కాల్చిన మక్కబుట్టను 15, 20 రూపాయల చొప్పున అమ్ముతున్నారు.

అల్పాహారంగా అంకాపూర్ మక్క వడలు...

అంకాపూర్ అనగానే దేశీ కోడి వంటకం గుర్తుకు వస్తుంది ..ఇప్పుడు అంకాపూర్ స్వీట్ కార్న్ కు అంతే పేరు వస్తుంది. అల్పాహారంగా దీనికి ఎంతో ప్రాధాన్యత లభిస్తుంది. ఈ స్వీట్ కార్న్ రుచితో పాటు ఆరోగ్యాన్ని అందిస్తుంది. వేడివేడి మక్క వడలను విక్రయిస్తూ పలువురు ఉపాధి పొందుతున్నారు.

దేశానికే ఆదర్శం..

కష్టపడి పని చేస్తూ దేశానికే ఆదర్శంగా మా గ్రామం నిలవడం హర్షనీయం. నేటి యువత కష్టపడి పని చేస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలి..

పైడి రాకేష్ రెడ్డి,, ఎమ్మెల్యే, ఆర్మూర్.

ఆరోగ్య సమస్యలు దూరం..

మొక్కజొన్న స్వీట్ కార్న్ తినడం వల్ల ఆరోగ్య సమస్యలు దూరం అవుతాయి. ఇందులో తక్కువ కేలరీలు, అధిక పీచు పదార్థం ఉంటుంది. ముఖ్యంగా యాంటీబయోటిక్ పుష్కలంగా ఉంటుంది .బీటా కెరోటిన్ తో కళ్ళకు మంచిది.

అజయ్, ప్రముఖ వైద్యులు, ఆర్మూర్.

